జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 20 మే 2026 | సంపుటి: 19 | సంచిక: 73 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: చతుర్థి - 11:10:00 వరకు నక్షత్రంఆరుద్ర - 06:13:19 వరకు, పునర్వసు - 28:13:27 వరకు కరణంవిష్టి - 11:10:00 వరకు, బవ - 21:45:28 వరకు పక్షంశుక్ల యోగంశూల - 14:10:01 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com


## ఐకేపీ వీవోఏలకు కనీస వేతనాలు ఇవ్వాలి

సమ్మె నోటీస్ ఇచ్చిన వివోఎలు

కామారెడ్డి,మే19(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఐకేపీ వీవోఏలకు కనీస వేతనాలు అందించాలని సిరికొండ మండల సమైఖ్య ఆధ్వర్యంలో ఏపీఎం సువర్ణకు, ఎంపీడీవో

మిగతా1 2లో..


## జలమండలిలో భారీ తిమింగలం

జనరల్ మేనేజర్ కుమార్ ఇళ్లపై ఎసిబి దాడులు

సోదాల్లో కుప్పలు తెప్పలుగా నగదు, నగలు స్వాధీనం

హైదరాబాద్,మే19(ప్రజాజ్యోతి): హైదరాబాద్ జలమండలిలో భారీ తిమింగలం పట్టుబడింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా భారీ ఎత్తున నగదు, నగలు, ఆస్తుల చిట్టాలు బయటపడ్డాయి.

మిగతా 2లో..



## యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి

# భూసేకరణ

## వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం

- ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సీఎం రేవంత్ సమీక్ష
- పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం
- కేసీఆర్ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతాం
- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,మే19(ప్రజాజ్యోతి): పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు.

మిగతా 2లో..



## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

- సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం
- 23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన
- అధికారికంగా ప్రకటించడమే తరువాయి

హైదరాబాద్,మే19(ప్రజాజ్యోతి): రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినెట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరి గుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి

మిగతా 2లో..

## ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

- ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారిపై ఆంక్షలు
- వీసాలను తాత్కాలికంగా నిలిపివేసిన అమెరికా
- ఎబోలాపై అప్రమత్తమైన భారత్
- ప్రజలకు హెచ్చరిక చేసిన అధికారులు




వాషింగ్టన్,మే19(ప్రజాజ్యోతి): ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డి ఆర్ సి) లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా,

మిగతా 12లో..

## దేశంలో చాపకింద నీరులా మతమార్పిళ్లు

- నాసిక్ ఘటన మరువక ముందే మరో ఘటన
- యూపిలో నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసులు
- పదిమంది నిందితుల అరెస్ట్.. ముమ్మర దర్యాప్తు



లక్నో,మే19(ప్రజాజ్యోతి): నాసిక్‌లోని ఓ బహుళజాతి కంపెనీలో బలవంతపు మత మార్పిళు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటువంటి మరో ఘటన ఉత్తర్‌ప్రదేశ్ లోని మీర్జాపూర్‌లో వెలుగులోకి వచ్చింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకొని మత మార్పిళ్లు చేస్తున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుర్తించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మీర్జాపుర్ లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా.. దీని వెనుక

మిగతా 12లో..




## తెలంగాణలో శాస్త్రీయంగా

# వ్యర్థాల నిర్వహణ

సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు

పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం

బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం

స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్షలో భట్టి

న్యూఢిల్లీ,మే19(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా

మిగతా 2లో..

## ఉద్యోగులు, పెన్షనర్ల కోసం


# హెల్త్ కేర్ ట్రస్ట్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈనెల 31లోపు పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు నమోదు

హైదరాబాద్,మే19(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎంపాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది.

మిగతా 12లో..



## వీధికుక్కలను తరలించాల్సిందే

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

ప్రతి జిల్లాలో పూర్తిస్థాయిలో బర్త్ కంట్రోల్

స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి

గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీం

న్యూఢిల్లీ,మే19(ప్రజాజ్యోతి): వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో




రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

మిగతా 12లో..

## జొన్నల కొనుగోలు కోసం ఆందోళన

జాతీయ రహదారిపై రైతుల ధర్నా

నిర్మల్,మే19(ప్రజాజ్యోతి): జొన్నలు కొనుగోలు చేయాలని డిమాడ్ చేస్తూ నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మార్కెట్ యార్డు వద్ద స్వర్ణ-నిర్మల్ రహదారిపై మంగళవారం రైతులు ధర్నా నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపుల గంటపాటు వాహనాలు ఎక్కడికక్కడే

మిగతా 2లో..



## వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

- అందుబాటులోకి కొత్తగా తొమ్మిది పౌర సేవలు
- డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రభుత్వం

హైదరాబాద్,మే19(ప్రజాజ్యోతి): జీహెచ్‌ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను

మిగతా 2లో..

# సంపాదకీయం

## దేశంలో రొయ్యల మార్కెటింగ్ పెంచాలి !

మనదేశంలో సరైన విధానాలు లేక పంటలు పండించిన రైతులు నానా యాతన పడుతున్నారు. సరైన మార్కెటింగ్ ఉండదు. సరైన రవాణా సౌకర్యం ఉండదు. సరైన వేదికలు ఉండవు. మదనపల్లి టమోటాలు పండించినా అవి ప్రజలకు చేరవు. నిజామాబాద్ పసుపు ప్రజలకు భారంగా మారింది. గుంటూరు, వరంగల్, ఖమ్మం మిర్చికి పేరొందినా ధర మా÷-తరం ప్రజలకు ఘాటెక్కిస్తుంది. వడ్లు, మక్కలు, శనగలు పండించినా వాటిని ప్రజలకు చేరువ చేసే యంత్రాంగం ఉండదు. దేశంలో ఏ మూల ఏం పండినా అది మారుమూల ప్రజలకు చేరవేసే సమర్థ వంతమైన మెకానిజం దేశంలో ఇంకా బలపడలేదు. అందుకే రైతులు తము పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వీలు కలగడం లేదు. వ్యాపారులు కూడా వాటిని కొనుగోలు చేసి, ప్రజలకు చేరవేయడం లేదు. మనదగ్గర మక్కలు పండితే ధరలు రావు. కానీ విదేశీ కంపెనీ కెల్లాగ్ వారు కార్న్ ఫ్లేక్స్ మాత్రం వందల్లో డబ్బులు పోసి పావుకిలో కొంటాం. అదే మన మక్కను వాల్యూ యాడెడ్ చేసి అమ్ముకో లేక పోతున్నాం. తాజాగా ఆక్వా రైతుల పరిస్థితి అదేవిధంగా ఉంది. విజినరీ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారే తప్ప, అందుకు మార్గాలను మాత్రం అన్వేషించడం లేదు. సైనికులకు సరిహద్దుల్లో సరైన ఆహారం దొరకడం లేదని ఆరోపణలు ఉన్నాయి. సైన్యం మెనూలో ఆక్వాను చేర్చాలని చంద్రబాబు కోరారు. ఇది మంచి ఆలోచనగానే గుర్తించాలి. అలాగే ప్రజలకు కూడా ఆక్వాను నేరుగా సరఫరా చేయగలగాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడితే ఎలా అన్నది ఆలోచించాలి. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే బాదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20–30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం కానరాలేదు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఎపిలో కూటమి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టుపట్టడం లేదు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాల్సి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇప్పుడు దేశీయంగా వీటిని ప్రజలకు చేరువ చేయాలి. 140 కోట్లకు పైగా ఉన్న మన దేశ ప్రజలకు సమతుల్య ఆహారం అవసరం. ఇందులో చేపలు, రొయ్యలు కూడా చేర్చాలి. అందుకు ప్రభుత్వాలు కార్యాచరణ చేయాలి. ప్రజల ఆహారం లో మన పంటలు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే, ఏ పంటయినా అమ్ముడు పోతుంది. మనదేశంలోని అన్ని పట్టణాలకు రొయ్యలు చేరేలా చేయాలి. అలా చేయకుండా ఎన్ని ప్రకటనలు గుప్పించినా లాభం లేదు. ఇప్పటికీ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు సక్రమంగా రొయ్యలు చేరడం లేదు. రైతులు పండించే పంటలకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేనంత కాలం ఇలాంటి సంక్షోభాలు ఎదుర్కోవాల్సిందే. అందుకు ప్రభుత్వాలదే బాధ్యత.

# యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

మొదటిపేజీ తరువాయి..

జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు – రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

# తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

మొదటిపేజీ తరువాయి..

పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరఫున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4–వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4–వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖీఖీ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుద్ధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్?2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జపాన్ దేశంలో ని కిటాక్యుష నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్ధాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో, తెలంగాణ రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు.

పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యర్థాల నిర్వహణను పారిశుద్ధ్య కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఆర్థిక విలువ సృష్టించే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

జపాన్ తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే అంశాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రజలు, స్థానిక సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ సంస్థల సహకారంతో తెలంగాణ సుస్థిర పట్టణ నిర్వహణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల,స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా లతో సహా సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జలమండలిలో భారీ తిమింగలం

మొదటిపేజీ తరువాయి..

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈ తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్‌తో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మల్లాపూర్‌లోని కుమార్ ఇంట్లో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించారు. జీఎం కుమార్ బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పలుగా ఉన్న నోట్ల కట్టలు చూసి అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే దర్శనమివ్వడంతో.. ఆ నగదు లెక్కింపునకు కౌంటింగ్ మెషీన్లను అధికారులు వినియోగించారు. దాదాపు రూ.1.20 కోట్ల నగదు,1.5 కిలోల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో మూడు ప్లాట్‌లు, 6 ఓపెన్ ప్లాట్‌లను అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి మరిన్ని ఆస్తులను గుర్తించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో 2 కార్లను సీజ్ చేశారు. మార్కెట్ విలువ ప్రకారం ప్రాథమికంగా 100 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గత నెలలో తన కుమార్తె వివాహాన్ని కుమార్ అంగరంగ వైభవంగా ఎంతో డబ్బులు వెచ్చించి మరీ జరిపించాడు. వివాహం కోసం కొన్ని కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు ఎలా సంపాదించారనే దానిపై కుమార్ వద్ద నుంచి ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

## ఐకేపీ వీవోఏలకు కనీస వేతనాలు ఇవ్వాలి


మొదటిపేజీ తరువాయి..

కార్యాలయం, పోలీస్ స్టేషన్లలో మంగళవారం వీవోఏలు సమ్మె నోటీసులు అందజేశారు. ఐకేపీ వవీవోఏలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని, అర్హులైన వీవోఏలను గుర్తించి సీసీలుగా పదోన్నతి కల్పించాలని, రూ.20 లక్షల బీమా వర్తింపజేయాలని, గ్రామాల్లో ఉచిత ట్యాబ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, ఐడి కార్డు అందజేయాలని, జీవో నెంబర్ 58 సవరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే చర్య తీసుకుని వేతనాల పెంపు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, లేకుంటే దశలవారీగా సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మున్ సింగ్, జ్యోతి, సీహెచ్ లక్ష్మి, ఎస్ లక్ష్మి, సునీత, సారా, లావణ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కోసం ఆందోళన

మొదటిపేజీ తరువాయి..

ఆగిపోయాయి. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తహసీల్దార్ కలెక్టర్ భవేశ్‌మిశ్ర దృష్టికి తీసుకువెళ్లి రెండు రోజుల్లో జొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సారంగాపూర్ మార్కెట్ యార్డులో జొన్నలు పోసి నెల రోజులు గడుస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 20 రోజుల క్రితం ప్రారంభించారని, అప్పటి ఇప్పటివరకు గన్నీ బ్యాగులు లేక ఒక గింజా కూడా కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణంలో మార్పుల వల్ల ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండడంతో జొన్నలు తడసి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.



## వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

మొదటిపేజీ తరువాయి..

విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

÷ూష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్, డెత్ హోమ్, ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. ÷ూష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

మొదటిపేజీ తరువాయి..

ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క – సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు.

**CHANGE OF NAME**

I, formerly known as "KOYYALA BABU (Old name)" S/o Koyyala Ramulu, aged about 43 years, residing at H. No. 8-112/1/2, Drivers Colony, Adloor, Kamareddy, Kamareddy District, Telangana State, have changed my name to **"KOYYALA BHASKAR (New name)"** S/o Koyyala Ramulu for all purposes. Hereafter, I shall be known and called only as "KOYYALA BHASKAR".

# జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తిగా నిర్మూలించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 19, (ప్రజాజ్యోతి) :** జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక రీచ్ లను గుర్తించాలన్నారు. అక్రమ ఇసుక త్రవ్వకాలని పూర్తిస్థాయిలో నివారిస్తామని చెప్పారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు పారదర్శకంగా జరగాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, భూగర్భ జల అధికారి శ్రీనివాస బాబు, డిపిఓ శ్రీనివాస్, రాయల్టీ ఇన్స్పెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సమేలలో బోరు తవ్వకాలు ప్రారంభం


**సర్పంచ్ సంతోష్ ఆధ్వర్యంలో పూజలు**



**ఆసిఫాబాద్, మే 19, ప్రజా జ్యోతి :** నీటి ఎద్దడితో సతమతమవుతున్న రైతులకు బోరు బావులు ఆశాకిరణంగా మారుతున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని సమేల గ్రామంలో మంగళవారం ఓ రైతు తన వ్యవసాయ పొలంలో బోరుబావి తవ్వక పనులు ప్రారంభించాడు. గ్రామ సర్పంచ్ వాడ్గురే సంతోష్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ వాహనాన్ని పొలానికి తీసుకువచ్చి పనులు చేపట్టారు. బోరు పాయింట్ వద్ద రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. నీరు పడితే పంటలకు ఢోకా ఉండదని, సాగు ఖర్చులు తగ్గుతాయని రైతు హర్షం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్ మాట్లాడుతూ వర్షాధార పంటల వల్ల రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారని తెలిపారు. బోరుబావి ద్వారా నీటి వసతి కలిగితే ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు బోర్లు వేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తే మరింత ఉపయోగమని కోరారు.

# సందీప్ నగర్‌లో తాగునీటి కష్టాలు

- **చేతి పంపు మొరాయించిందని కాలనీవాసుల ఆవేదన**
- **పట్టించుకోని మునిసిపల్ అధికారులు**
- **శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసుల వినతి**



**ఆసిఫాబాద్ మే 19 ప్రజా జ్యోతి :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ మునిసిపాలిటీ 11వ వార్డు సందీప్ నగర్‌లో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. కాలనీలో ఉన్న చేతి పంపులో నీరు లేక పనిచేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం కాలనీవాసులు చేతి పంపు వద్దకు చేరుకుని తమ సమస్యను వ్యక్తం చేశారు. నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీరు సరిపోక తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. వేసవి తీవ్రత పెరుగుతున్న కొద్దీ నీటి ఎద్దడి మరింత అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కొత్త బోరు వేయించి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కాలనీవాసులు కోరారు. స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ఉపాధి పనులపై ఉప సర్పంచ్ దృష్టి

- **పునగుడం-ఏల్లాపూర్ రోడ్డు పనులు పరిశీలించిన లాహుకుమార్**
- **కూలీలతో మమేకమైన నేత నీడ, మంచినీరు ఏర్పాటు చేయాలని ఆదేశం**



**ఆసిఫాబాద్ మే 19 ప్రజా జ్యోతి :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని పునగుడం నుంచి ఏల్లారం గ్రామానికి వెళ్లే రోడ్డులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గ్రామ ఉప సర్పంచ్ లోబడే లాహుకుమార్ మంగళవారం ఉదయం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ లాహుకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయన్నారు. కూలీలకు సకాలంలో పని కల్పించడంతో పాటు వేతనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు నీడ, మంచినీటి వసతి కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్,దేవిదాస్ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కీ. శే. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులు అర్పించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న





**గాదిగూడ, మే 19 (ప్రజా జ్యోతి) :** సిపిఎం పార్టీ నిర్మాత పుచ్చల పల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల గాదిగూడ మండల కమిటీల ఆధ్వర్యంలో గాదిగూడ మండలం లోకారి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య గారి వర్ధంతి కార్యక్రమం సిపిఎం పార్టీ కుండిషేక్ గూడ గ్రామ ఉపసర్పంచ్ కుమ్ర భీంరావ్ సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ సుందరయ్య గారు సిపిఎం పార్టీ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించారాని,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమికోసం,గుత్తి కోసం వెట్టిచాకిరి,విముక్తి కోసం పోరాటం చేసిన మహావీరుడు అని,కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సుందరయ్య గారి స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ లను రైతు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కార్మికులకు కాలరాస్తున్న 29 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగిస్తూ నాలుగు లేబర్ కోడ్స్ ని రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కార్మికులకు ఆదివాసులకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని ఆదివాసులకు ఇందిరమ్మ ఇళ్లను, జీవో నెంబర్ 3 ప్రకారం ఆదివాసులకు ఫారెస్ట్ ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఆదివాసులకు కార్మికులకు ప్రజలకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కుండి షేక్ గూడ గ్రామ ఉపసర్పంచ్ కుమ్రా భీంరావ్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం గాదిగూడ మండల అధ్యక్షులు కొట్నాక్ సాకారం, సిఐటియు మండల కన్వీనర్ కొడప యశ్వంత్, నాయకులు మెస్రం కేశవ్, సిడాం బాపూరావు, మడావి మనకు, కిషన్, కే.సుంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క మెసేజ్‌తో లీగల్ హెల్ప్...

**ఆస్తి తగాదాలైనా, కుటుంబ గొడవలైనా.. పరిష్కారం మీ వాట్సాప్‌లోనే!**




**గుడిహత్నూర్ మే 19 (ప్రజా జ్యోతి) :** సామాన్య మధ్య తరగతి పౌరులకు చట్టపరమైన సేవలను మరింత చేరువ చేస్తూ కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ విప్లవాత్మక నిర్ణయం తీసు కుంది. దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ ఉచితంగా న్యాయ సలహాలు అందించేం దుకు 'న్యాయ సేతు' పేరుతో వాట్సాప్ చాట్‌బాట్‌ను అందు బాటులోకి తెచ్చింది. న్యాయాన్ని మరింత సులభంగా, అందరికీ అందించే దిశగా వేసిన ఈ అడు గుతో.. ఇకపై న్యాయ సహాయం కేవలం ఒక్క మెసేజ్ దూరంలోనే ఉండనుంది.

**ఏయే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది..? :** ఈ ఏఐ ఆధారిత చాట్‌బాట్ ద్వారా పౌరులు వివిధ చట్టపరమైన అంశాలపై ప్రాథమిక సమాచారం, సల హాలు పొందవచ్చు. ముఖ్యంగా వివాహ సంబంధిత సమస్యలు, విడాకులు, ఆస్తి తగాదాలకు సంబం ధించిన వివరాలను తెలుసుకోవచ్చు. అలాగే గృహ హింస బాధితులకు అవసరమైన న్యాయ మార్గదర్శ కత్వం కూడా లభిస్తుంది. భూవివాదాలు, నేర చట్టా లకు సంబంధించిన ప్రాథమిక సమాచారం కూడా దీని ద్వారా అందుబాటులో ఉండనుంది. అంతేకాకుండా వాణిజ్య వివాదాలు, రక్షణ రంగానికి చెందిన చట్ట పరమైన సందేహాలను కూడా దీని ద్వారా నివృత్తి చేసుకోవచ్చు.

**న్యాయ సేతు'ను ఎలా ఉపయోగించాలి? :** ఈ సేవలను వినియోగించుకోవడం చాలా సులభం. ముందుగా మీ మొబైల్‌లో "7217711814" అనే నంబర్‌ను సేవ్ చేసుకోండి. వాట్సాప్ ఓపెన్ చేసి ఈ నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపండి. (ఇది 'ఏవశ్రీవ- ్ఞుఖ' పేరుతో కనిపిస్తుంది). మీ మొబైల్ నంబర్‌ను వెరిఫై చేసుకున్న తర్వాత.. చాట్‌బాట్ మీకు అవసర మైన ఆప్షన్లను చూపిస్తుంది. అయితే స్మార్ట్ నావిగేషన్ సాయంతో మీకు కావాల్సిన సమాచారాన్ని వేగంగా పొందవచ్చు. ప్రభుత్వం ఈ సేవలను గొప్పగా ప్రారం భించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో కొన్ని సాంకేతిక సమస్య లు ఎదురవుతున్నట్లు వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నారు. చాట్‌బాట్ అప్పుడప్పుడు 'బిల్డ్ ఎర్రర్' అని చూపి స్తోందని సోషల్ మీడియా వేదికగా నెటి జన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మెటా యాజ మాన్యంలోని వాట్సాప్‌కు బదులుగా భారత్ స్వదేశీ ప్లాట్‌ఫామ్ అరట్టైని ఎందుకు వాడలేద ని ప్రశ్నిస్తున్నారు. న్యాయ సేతు ప్రారంభంతో పాటు వాట్సాప్ తన వినియోగదారుల కోసం సరికొత్త అప్ డేట్‌లను (వెర్షన్ 2.26.1.18) కూడా తెచ్చింది. ఇకపై యూజర్లు థర్డ్ పార్టీ యాప్‌ల అవసరం లేకుండానే వాట్సాప్‌లోనే సొంతంగా టెక్స్ట్ స్టిక్కర్లను తయారు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది బీటా టెస్టర్లకు మాత్రమే అందుబాటులో ఉండగా.. త్వరలోనే అందరికీ అందు బాటులోకి రానుంది. మొత్తానికి కోర్టుల చుట్టూ తిరగలేని పేదలకు, సామాన్యులకు 'న్యాయ సేతు' ఒక డిజిటల్ వారధిగా నిలుస్తుందని ప్రభుత్వం భావి స్తోంది. సాంకే తిక లోపాలను సరిదిద్దితే.. ఇది దేశం లోనే అతిపెద్ద లీగల్ హెల్ప్ డెస్క్‌గా అవతరించే అవకాశం ఉంది.

# దిలావర్ పూర్ సర్పంచ్ పై ఫిర్యాదుపై, విచారణ ఎలాంటి తప్పిదాలు లేవన్న ఎంపీ ఓ రత్నాకర్ రావు





**ఖానాపూర్ మే 19(ప్రజాజ్యోతి) :** ఖానాపూర్ మండలంలోని దిలావర్పూర్ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం గ్రామసభ ఎంపీడీవో రాథోడ్ రాధ ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా దిలావర్పూర్ సర్పంచ్ పై అవకతవకలు జరిగినట్లు పలువురు సభ్యులు ఫిర్యాదులు అందజేశారు ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ అధికారి చిక్యాల రత్నాకర్ రావు విచారణ చేపట్టాలన్న మేరకు దిలావర్పూర్ పంచాయతీలో పనుల అవకతవకలపై పూర్తి విచారణ మంగళవారం సభ్యుల సమక్షంలో నిర్వహించగా పనులకు సంబంధించిన రికార్డులలో,ఎంబిలలో,ఎలాంటి తప్పిదాలు లేవని క్షనిక వేశంలో ఫిర్యాదు చేసినట్లు ఫిర్యాదు దారులు రాతపూర్వకంగా పత్రం ఇవ్వడంతో దిలావర్పూర్ గ్రామపంచాయతీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఎంపీ ఓ చిక్యాల రత్నాకర్ రావు ప్రకటనలో తెలియజేశారుఇందులో సభ్యులు రాజేశ్వర్,నరసయ్య అనిల్ కుమార్, ఎ,రాజశేఖర్ లావణ్య, రాధా, రాజశ్రీ,సౌజన్య తో పాటు సర్పంచ్ మల్లేష్ ల సమక్షంలో విచారణ జరిపినట్లు ఎంపీ ఎవరు తెలిపారు

# సరస్వతి నది అంత్య పుష్కరాలకు ట్రాఫిక్ ఏర్పాట్లు పరిశీలించిన డీసీపీ







**భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు**

**మంచిర్యాల, 19,మే (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి నది అంత్య పుష్కరాల సందర్భంగా భక్తుల రాకపోకలకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ మంగళవారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు మరియు ఇతర పోలీసు అధికారులతో కలిసి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్న ప్రధాన రహదారులు, వంతెనలు, కీలక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మే 21వ తేదీ ఉదయం నుంచి 12 రోజుల పాటు కాళేశ్వరం సరస్వతి నది తీరంలో అంత్య పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో రామగుండం, పెద్దపల్లి, ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా జైపూర్, భీమారం, చెన్నూర్ మార్గాల్లో ట్రాఫిక్ ఒత్తిడి పెరిగే అవకాశముండటంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై అధికారులతో డీసీపీ సమీక్ష నిర్వహించారు. పుష్కరాల సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, భీమారం ఎస్సై రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్లతో వాహనదారులకు నరకయాతన

- **టార్పాలిన్ లేకుండా ఓవర్‌లోడ్‌తో తరలింపు..**
  **కళ్లలో ఇసుక పడి బెంబేలు**

**ఆసిఫాబాద్ మే 19 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రధాన రహదారులపై ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం ఇసుకను టార్పాలిన్‌తో పూర్తిగా కప్పి తరలించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ట్రాక్టర్లలో పరిమితికి మించి ఇసుక నింపి యథేచ్ఛగా తరలిస్తున్నారు.

ట్రాలీలపై నామమాత్రంగా పచ్చటి కవర్ కప్పినా, ఓవర్‌లోడ్ కారణంగా ఇసుక రోడ్లపై చెల్లాచెదురుగా పడుతోంది. గాలికి ఇసుక ఎగిరి వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడుతుండడంతో ఒక్కసారిగా కళ్లు మూసుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్లపై పడిన ఇసుకతో వాహనాలు స్కిడ్ అవుతున్నాయని వాపోతున్నారు. ఆసిఫాబాద్ నుంచి జైనూర్ సహా పలు మార్గాల్లో ప్రతిరోజూ వందలాది ఇసుక ట్రాక్టర్లు ఇలాగే రాకపోకలు సాగిస్తున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తనిఖీలు చేపట్టి టార్పాలిన్ లేని, ఓవర్ లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 19, (ప్రజాజ్యోతి) :** జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో, జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారి జిల్లాలో ఇప్పటి వరకు పూర్తిచేసిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అన్నారు. అందుబాటులో లేని రైతులకు సంబంధించి వివరాలను వివిధ మార్గాల్లో అన్వేషించాలని సూచించారు. రిజిస్ట్రీ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సంబంధమైన ఇబ్బందులు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మొత్తం ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వ కొరకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 19, (ప్రజాజ్యోతి) :** జిల్లాలో ధాన్యం నిల్వ చేయుటకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే గోదాములకు తరలించాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అదనంగా, ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు సమకూర్చుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో గోదాములు అందుబాటులో ఉంటే, ఆ ప్రదేశాలు గుర్తించి ధాన్యం అక్కడికి తరలించాలని వివరించారు. ధాన్యం నిరంతరాయంగా తరలింపునకు అనుగుణంగా తగినన్ని లారీలు, తగినంత మంది హమాలీలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**హెచ్ఈఓ రవీందర్**



**నేరడిగొండ మే 19 (ప్రజాజ్యోతి) :** మండలంలోని చించోలి గ్రామంలో మంగళవారం నాడు 'డీఏజేజీయూఏ' (దాజుగా) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామస్థుల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (హెచ్ ఈ ఓ) రవీందర్, ఎస్సీఆర్పీ ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటిస్తూ, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పి) వైష్ణవి, ఏఎన్ఎం రాణి గ్రామంలోని రోగులకు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు ఈ సందర్భంగా సూచించారు. ఈ వైద్య శిబిరంలో ఆశా కార్యకర్త భూలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ (ఏ డబ్ల్యు టి ) లక్ష్మి, గ్రామ ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# మహిళల భద్రతకే 'షీ టీమ్స్' ప్రాధాన్యత



**దండేపల్లి, మే 19 (ప్రజాజ్యోతి) :** మహిళలు, పిల్లల రక్షణే లక్ష్యంగా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని జిల్లా ఇంచార్జి ఎస్సై ఉషారాణి అన్నారు. మంగళవారం దండేపల్లిలోని మగ్గం వర్క్ శిక్షణా కేంద్రంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు, సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100 లేదా రామగుండం షీ టీమ్ నంబర్ 6303923700 కు సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు వహించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది జ్యోతి, వనిత మరియు మహిళలు పాల్గొన్నారు.

# సన్న వరితో పాటు దొడ్డు వరి కూడా దింపుకోవాలి

- ప్రభుత్వ ఆదేశాలు పాటించని మిల్లర్లపై కఠిన చర్యలు

వనపర్తి ప్రతినిధి, మే 19 (ప్రజాజ్యోతి): జిల్లాలోని రైస్ మిల్లర్లు సన్న రకం వరితో పాటు దొడ్డు రకం వరి ధాన్యాన్ని కూడా తప్పనిసరిగా దింపుకోవాలని, ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రబీ సీజన్ వరి ధాన్యం దింపుదలపై రైస్ మిల్లర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 55 మిల్లులు వరి ధాన్యం కేటాయింపులకు అర్హత



సాధించగా, కేవలం 9 మిల్లులు మాత్రమే దొడ్డు రకం వరి ధాన్యాన్ని దింపుకుంటున్నాయని తెలిపారు. మిగతా మిల్లర్లు నిరాకరిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మిల్లు సన్న, దొడ్డు రకాల వరి ధాన్యాన్ని రెండింటినీ దింపుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. దొడ్డు వరి దింపుకోవడంలో సహకరించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే బ్లాక్‌లిస్టులో చేర్చాల్సి వస్తుందని హెచ్చరించారు. మిల్లర్లకు ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేస్తే ప్రభుత్వం తరఫున పరిష్కారానికి సహకరిస్తామని చెప్పారు. అలాగే రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ అధికారులకు జిల్లాలో ఖాళీగా ఉన్న గోదాములను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ధాన్యం నిల్వలకు అవసరమైన గోదాములను ఓపెన్ చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, జిల్లా మేనేజర్ ఆంజనేయులు, గిడ్డంగుల కార్పొరేషన్ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# ఈఏపీసెట్‌లో స్కాలర్స్ విద్యార్థుల సత్తా

- జిల్లాలో అగ్రికల్చర్ లో ప్రథమ స్థానం సాధించిన తేజ హరిణి


వనపర్తి ప్రతినిధి, మే 19 (ప్రజాజ్యోతి): ఈఏపీసెట్–2026 ఫలితాల్లో స్కాలర్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. అగ్రికల్చర్ విభాగంలో కె. తేజ హరిణి 3634 ర్యాంకు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానం దక్కించుకుంది. అలాగే డి. మహేష్ 6257, జి. గాయత్రి 8208, అలీషా సాజీ 8334, జి. బాంధవి 9756, ఎస్. వర్షిత 11159, టి. బిందు 11519, కే. హరిత రాణి 14674, ఎన్. రాంచరణ్ 15575, ఎం. ప్రత్యూష 15738, సి. మమత 15899, ఎన్. చరిత 16349, జి.




స్పందన 16734, డి. పల్లవి 17457, వై. జ్ఞానేశ్వరి 18926 ర్యాంకులు సాధించారు. విద్యార్థుల విజయంపై కళాశాల యాజమాన్య సభ్యులు డాక్టర్ పి. జగదీశ్వర్, డాక్టర్ జి. వరప్రసాదరావు, డాక్టర్ ఎల్. సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ బి. నాగేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాళ్లు ఏ. శ్రీధర్, బి. మధుసూదన్ గుప్తా ఆధ్వర్యంలో విద్యార్థులను శాలువాలు, బొకేలు అందించి సత్కరించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

# జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మీడియా అక్రిడేషన్ కార్డుల పంపిణీ


గద్వాల మే 19 (ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అక్రిడేషన్ కార్డులను అందజేశారు.ఈ సమావేశంలో డీపీఆర్వో ఆరిఫుద్దీన్ కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్‌కు పరిచయం చేశారు.అనంతరం 2026–28 సంవత్సరాలకు సంబంధించిన అక్రిడేషన్ కార్డుల పంపిణీపై చర్చ జరిగింది.మిగతా అర్హులైన వారికి కూడా త్వరలో అక్రిడేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు



జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెద్ద ఇస్మాయిల్,రవీందర్ రెడ్డి,శ్రీనివాసులు,సిరాజ్,జాన్,వెంకటేష్,నల్లన్న,భీమరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు, ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమీక్ష

మహబూబ్‌నగర్, మే 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఈవో జడ్పీ, డిఆర్డిఒ, పీడీ హౌసింగ్, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ డీఈలు, ఏఈలు, పీడీ హౌసింగ్ ఏఈలు, డిఆర్డిఏ ఏపీడీలు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీఓలు పాల్గొన్నారు. సమావేశంలో ఇందిరమ్మ ఇండ్లు, లేబర్ మొబిలైజేషన్, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, నర్సరీలు, శానిటేషన్, త్రాగునీటి సరఫరా, సీఎం ప్రజావాణి, కలెక్టర్ ప్రజావాణి, ఆర్టీఏ యాక్ట్, కోర్టు కేసులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. అధికారులు ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న డీఎఫ్ఓ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో ఎన్జీఎన్ఆర్ పనులను గుర్తించి సమర్థవంతంగా అమలు చేసేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.




# మహనీయుల విగ్రహాలకు రక్షణ కరువా..?

- పూలమాలలకే పరిమితమైన గౌరవం..!
- మహనీయుల సేవలకు ఇదేనా సమాజం ఇచ్చే గౌరవం..?
- జయంతి, వర్ధంతులకే పరిమితమవుతున్న నివాళులు

వనపర్తి ప్రతినిధి, మే 19 (ప్రజాజ్యోతి): వనపర్తి పట్టణంలోని కమాన్ చౌరస్తాలో ఉన్న దివంగత మాజీ ఎమ్మెల్యే, బడుగు బలహీన వర్గాల ప్రజా వైద్యుడిగా పేరుగాంచిన డా. బాలకృష్ణయ్య విగ్రహం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవడం సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వనపర్తి నియోజకవర్గంలో సర్పంచుగా, చైర్మన్ గా, ఎమ్మెల్యే గా పనిచేసిన ఆయన వనపర్తికి శాశ్వత తాగునీటి పథకం, ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హైస్కూల్‌తోపాటు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయటంలో ఆయన చేసిన కృషి మరువలేనిది. రాజకీయాలకు అతీతంగా, వనపర్తి చుట్టుపక్కల ప్రాంతాలలోని పేద ప్రజలకు నామమాత్రపు ఫీజుతో, ఉచితంగా వైద్యం అందించడం ద్వారా 'ప్రజా డాక్టర్' గా గుర్తింపు పొందారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించి, పేదల పాలిట ఆదరణగా నిలిచిన నాయకుడి విగ్రహం చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడం స్థానికులను కలిచివేస్తోంది. ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయులకు సమాజం ఇస్తున్న గౌరవం ఇదేనా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ప్రజా సేవకు ప్రతీకగా నిలిచిన నాయకుల జ్ఞాపక చిహ్నాలు నేడు సంరక్షణ లేక వెలవెలబోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

## నివాళులు మాటల్లోనేనా..?

జయంతి, వర్ధంతి రోజులు వచ్చినప్పుడల్లా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం, ఫోటోలు తీసుకోవడం, ప్రకటనలు ఇవ్వడం సాధారణమైపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. కార్యక్రమాలు ముగిసిన వెంటనే విగ్రహాల పరిస్థితిని పట్టించుకునే వారు లేకపోవడం బాధాకరమని అంటున్నారు. నిజమైన గౌరవం అనేది ఒక్కరోజు కార్యక్రమాల్లో కాకుండా, ప్రతి రోజు సంరక్షణలో కనిపించాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

## సమాజానికి దారి చూపిన మహనీయులు

బాలకృష్ణయ్య లాంటి నాయకులు రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజా సేవను ధ్యేయంగా పెట్టుకొని పనిచేశారు. పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారు. అలాంటి మహనీయుల విగ్రహాలు అపరిశుభ్రంగా ఉండటం సమాజ చైతన్యానికి మచ్చగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సామాజిక బాధ్యత పెరగాలి

మహనీయుల విగ్రహాలను కాపాడుకోవడం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, సమాజం మొత్తం బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందని సామాజికవేత్తలు సూచిస్తున్నారు. యువత, ప్రజా సంఘాలు, స్థానిక సంస్థలు కలిసి విగ్రహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

## భావితరాలకు సందేశం ఏమిటి..?

మన చరిత్రను, ప్రజా సేవ చేసిన మహానుభావులను గౌరవించలేని సమాజం భావితరాలకు ఏ విలువలు నేర్పుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విగ్రహాలకు పూలమాలలు వేసే సంస్కృతి కంటే, వారి ఆశయాలను కొనసాగించే సామాజిక బాధ్యత పెరగాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## మారాల్సింది మన ఆలోచన

మహనీయుల జయంతి, వర్ధంతి రోజుల్లో హడావుడిగా కార్యక్రమాలు నిర్వహించడం కంటే, ప్రతిరోజూ వారి జ్ఞాపకాలను గౌరవించే సంస్కృతి రావాలని ప్రజలు కోరుతున్నారు. విగ్రహాల వద్ద పరిశుభ్రత, రక్షణ, గౌరవం కల్పించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించి



నట్టవుతుందని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. విగ్రహాల సంరక్షణపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం పరిశుభ్రత చర్యలు, రక్షణ గోడలు, లైటింగ్ వంటి సదుపాయాలు కల్పించడంలో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలలో ఆవేదన వ్యక్తమవుతోంది.

# బీఆర్ఎస్ వునికిని చరుకునెందుకే పాలమూరు ప్రాజెక్ట్ పేరుతో డ్రామాలు : యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, మే 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ) బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో తమ ఉనికిని చాటుకునేందుకు పాలమూరు ప్రాజెక్టు పేరుతో డ్రామాలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. సీఎల్పీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధుల ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. "నేను ఇంట్లో పడ్డా.. మీకేం అయింది..? ఎందుకు రోడ్ల మీదికి రావడం లేదు..?" అంటూ కేసీఆర్ తమ నాయకులనే ప్రశ్నించడంతో ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు వరుసగా ప్రెస్‌మీట్లు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు ప్రాజెక్టును బీఆర్ఎస్ హయాంలోనే బొందపెట్టారని, ఇప్పుడు అదే అంశంపై ప్రజల్లోకి రావడం రాజకీయ నాటకమని అన్నారు. కేసీఆర్ మాయమాటలు, మోసాలను మహబూబ్‌నగర్ ప్రజలు నమ్మలేదని, అందుకే ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 12 చోట్ల కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలోనే నిర్ణయాలు తీసుకుంటుందని, ప్రజలు, నాయకులతో చర్చించి పారదర్శకంగా ముందుకు సాగుతుందని తెలిపారు. పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన విషయాన్ని తెలంగాణ ప్రజలు మర్చిపోలేదన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని,



నీళ్లను పదవుల కోసం తాకట్టు పెట్టింది బీఆర్ఎస్ నాయకత్వమేనని ఆరోపించారు. తెలంగాణకు ఇప్పుడు రక్షణ కవచంగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తోందని, బీఆర్ఎస్ హయాంలో కూలిపోయే ప్రాజెక్టులు నిర్మించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 70–80 ఏళ్లు నిలిచే నాణ్యమైన ప్రాజెక్టులను నిర్మించి చూపిస్తుందని తెలిపారు. అధికారంలో ఉన్నందున పెండింగ్‌లో ఉన్న ప్రతి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మే 19(ప్రజా జ్యోతి ప్రతినిధి): జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా,వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.ఇప్పటికే జిల్లాలో 70 శాతం మొక్కజొన్న కొనుగోలు పూర్తయిందని, మిగిలిన కొనుగోళ్లు వచ్చే మూడు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు.మంగళవారం గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.కొనుగోలు కేంద్రానికి భారీగా మొక్కజొన్న రావడంతో మార్కెట్ యార్డు పరిసరాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని పరిశీలించారు.అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.షెడ్లు సరిపోక బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉంచిన మొక్కజొన్నను ముందుగా తూకం చేయాలని అధికారులను ఆదేశించారు.లారీల కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రభుత్వ గోదాములు సరిపోని పరిస్థితుల్లో ప్రైవేటు గోదాములను కూడా వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం హమాలీల కొరత సమస్య పరిష్కారమైందని చెప్పారు.అనంతరం రైతుల ధ్రువీకరణ పత్రాలు,కొనుగోలు రిజిస్టర్లను పరిశీలించి,పలువురు రైతులతో మాట్లాడారు.తరువాత జిల్లాలోని ఎనిమిది మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ,మార్క్‌ఫెడ్ డీఎం చంద్రమౌళి,డీఏవో వీరప్ప,డీపీఓ శ్రీకాంత్,పౌర సరఫరాల శాఖ మేనేజర్ విమల,గద్వాల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శ్రీకాంత్,గద్వాల మండల వ్యవసాయాధికారి ప్రతాప్ కుమార్,తహసీల్దార్ హరికృష్ణ, పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.





# కోయిలసాగర్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- పర్యాటక అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

మహబూబ్‌నగర్, మే 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లా యువజన, క్రీడలు మరియు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 18 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న పర్యాటక, యువజన, క్రీడల వారోత్సవాల సందర్భంగా మంగళవారం దేవరకద్ర మండలంలోని కోయిలసాగర్ ప్రాజెక్ట్ వద్ద నిర్వహించిన పర్యాటక అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పర్యాటక అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోయిలసాగర్ ప్రాజెక్ట్ పర్యాటకులను ఆకర్షించడమే కాకుండా రైతుల పంటలకు సాగునీరు అందిస్తూ జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి కూడా దోహదపడుతోందన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కోయిలసాగర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే జిల్లాకే కాకుండా రాష్ట్రం, దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టులు, చారిత్రక ప్రదేశాలను సందర్శించడం ద్వారా పిల్లలు ఆనందంతో పాటు చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవచ్చన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి జిల్లాలోని పిల్లలమర్రి, కోయిలసాగర్ వంటి పర్యాటక ప్రదేశాలను సందర్శించాలని సూచించారు. పిల్లలు ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకుని, సందర్శించిన ప్రదేశాల విశేషాలను నిపుణులను అడిగి తెలుసుకోవాలని ఆమె సూచించారు. ఇటువంటి పర్యటనల ద్వారా వినోదంతో పాటు జ్ఞానం కూడా పెరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ కోయిలసాగర్ ప్రాజెక్ట్ డ్యామ్‌ను సందర్శించి ప్రాజెక్ట్ ఆయకట్టు, నీటి నిల్వ సామర్థ్యం, నీటి వినియోగం, మరమ్మత్తులు, నిర్వహణ, పెండింగ్ పనుల నిర్మాణం తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తదుపరి కోయిలసాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఎస్ఎస్‌సీ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్మానించి అభినందించారు. పాఠశాల కాంపౌండ్ గోడ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లా యువజన, క్రీడలు మరియు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్యాంపులో



శిక్షణ పొందిన వాలీబాల్ క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా యువజన, క్రీడలు మరియు పర్యాటక శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, దేవరకద్ర తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

మహబూబ్‌నగర్, మే 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ) అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవరకద్ర మండలం నాగారం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గన్ని బస్తాల కొరత లేకుండా తగినన్ని బస్తాలను అందుబాటులో ఉంచుకోవాలని, అధిక సంఖ్యలో హమాలీలను



నియమించుకోవాలని, రవాణా వాహనాలను సమకూర్చుకొని నింపిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. అనంతరం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కోడూర్ జననీ ఆగ్రోటెక్ బాయిల్డ్ రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. రైస్ మిల్లులో అధిక సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసి లారీలను వెంటనే అన్‌లోడింగ్ చేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు తగినన్ని వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు తరుగు కటింగ్ చేయకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మిల్లర్ యాజమాన్యానికి సూచించారు.
ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు: ఎస్పీ టి.శ్రీనివాస రావు

గద్వాల మే 19(ప్రజా జ్యోతి ప్రతినిధి): జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు తెలిపారు.యువత భవిష్యత్తును దెబ్బతీసే డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలు,విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు చేపట్టిందన్నారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు నార్కోటిక్ జాగిలం "జిమ్మీ"సహాయంతో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఇప్పటికే గద్వాల టౌన్,గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని




భీమ్‌నగర్,చింతలపేట,గంజిపేట,దౌదర్‌పల్లి,సంగాల,జమ్మిచేడు,గుర్రంగడ్డ,జనగాంపల్లి,అనంతపురం,బసల్ చెరువు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో వాహనాలు, బ్యాగులు,పాన్ షాపులు,కిరాణా దుకాణాలు,అనుమానాస్పద వస్తువులను నార్కోటిక్ జాగిలం"జిమ్మీ"సహాయంతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.యువత ఎక్కువగా సంచరించే ప్రాంతాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,"డ్రగ్స్ మహమ్మారి సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతోంది.ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదు.అక్రమ రవాణా,నిల్వలు,విక్రయాల్లో పాల్గొనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు,యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ లేదా గంజాయి విక్రయాల సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ప్రజల సహకారంతో జిల్లాను"డ్రగ్ ఫ్రీ జిల్లా"గా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని ఎస్పీ స్పష్టం చేశారు.

## బడిబాటపై కలెక్టర్ ఫోకస్

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు
- 10 శాతం పెంచాలని ఆదేశం



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 19, (ప్రజా జ్యోతి) :** జిల్లాలో బడిబాట కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో బడిబాట కార్యక్రమాల పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈసారి కనీసం 10 శాతం నమోదు పెరిగేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, మండల అధికారులను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, సురక్షిత వాతావరణంపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో గతంలో మూతపడిన కొన్ని పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నమోదు తక్కువగా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల వారీగా ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ అర్హులైన ప్రతివారికి చేరేలా చూడాలని చెప్పారు.పాఠశాలల పునఃప్రారంభానికి ముందే భవనాలకు రంగులు వేయడం, పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. యూడైస్ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అర్హతలు, అనుమతులు, ఫీజుల నిర్మాణంపై తనిఖీలు నిర్వహించాలని డీఈవో, ఎంఈవోలకు సూచించారు.జిల్లాలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమంలో ఎన్యూమరేటర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు గృహాల లెక్కింపును త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డీఈవో ఎల్‌వీ గిరిరాజ్ గౌడ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, 14 మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబనికి అండగా రాజరాజేశ్వర స్వామి ఫౌండేషన్

- నిరుపేదలకు సేవలు అందించడమే ఫౌండేషన్ లక్ష్యం
- ఏనుగు శివయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం నునే అందజేత చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి మే 19 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మొరిపిరాల గ్రామంలోబీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగు శివయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి, ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ ను సహాయం చేసి, పేదలు, నిస్సహాయులకు అండగా ఉండటమే మా ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి .ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్ మాజీ సర్పంచ్ అనిరెడ్డి యకూబ్ రెడ్డి మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు చేగురి మల్లేష్ పార్టీ ముఖ్య నాయకులు ఏనుగు కుమార్, బిట్కూరి మల్లేష్, భాస్కర్, సుధీర్ రాజు, బొమ్మరబోయిన శ్రీనివాస్, తాళ్లపెల్లి రాజేష్, ప్రభాకర్, సాంబయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, కొమురయ్య, కుమార్, ఏనుగు యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

## రాజనీతి శాస్త్రంలో కుమారస్వామికి డాక్టరేట్

- తెలంగాణ ప్రాంతీయ రాజకీయ పార్టీలపై పరిశోధనకు గుర్తింపు



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 19, (ప్రజా జ్యోతి):** కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం పరిశోధకుడు చీకటి కుమారస్వామి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ మంగళవారం డాక్టరేట్ ప్రకటించారు. "రోల్ ఆఫ్ రీజినల్ పొలిటికల్ పార్టీస్ ఇన్ ఇండియా విత్ స్పెషల్ రిఫరెన్స్ టు తెలంగాణ స్టేట్" అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు ఈ డాక్టరేట్ లభించింది. కేయూ రాజనీతి శాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రన్ పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కుమారస్వామి ఐదు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశోధన పత్రాలను ప్రచురించారు. సిద్ధాపూర్, సీకేఎం, ఎల్బీ కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన ఆయన కాకతీయ యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రంలో ఎంఏ పట్టా పొందారు. వరంగల్ తాళ్ల పద్మావతి కళాశాలలో బి.ఎడ్ పూర్తి చేశారు. ఎంఫిల్ ప్రవేశ పరీక్షల్లో యూనివర్సిటీ రెండో ర్యాంకు సాధించారు. ప్రస్తుతం హనుమకొండలోని శ్రీ మేధావి జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామిని తల్లిదండ్రులు రామచంద్రం, వీరలక్ష్మి, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

### ఎక్కువ తూకం వేస్తే చర్యలు తప్పవు

## లోడింగ్, ఆన్ లోడింగ్ త్వరగా కావాలి

- సరిపడా ట్రక్‌లు ఉన్నాయి మిల్‌ల దగ్గర ఆలస్యం కావద్దు
- ప్రతీ కేంద్రాన్ని పర్యవేక్షించండి : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మే 19 (ప్రజాజ్యోతి) :** ధాన్యం 41 కేజీల కన్నా ఎక్కువ తూకం వేస్తే చర్యలు తప్పవని, లోడింగ్, ఆన్ లోడింగ్ త్వరగా కావాలని, సరిపడా ట్రక్ లు ఉన్నాయని, మిల్ ల దగ్గర ఆలస్యం కావద్దని, ప్రతీ కేంద్రాన్ని సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, సివిల్ సప్లై, రవాణా, డిఆర్డీఓ, సహకార తదితర శాఖల అధికారులు అలాగే కేంద్ర నిర్వాహకులు సమన్వయముగా పని చేయడం తో పాటు, అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణలు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి అయ్యేలా బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం జనగాం మండలం పెద్ద పహాడ్ లో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అసస్మికంగా సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్,ట్యాబ్ ఎంట్రీ ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నీ కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వ నిబంధన లకు అనుగుణంగా కొనుగోలు కావాలని., 41 కేజీ కంటే ఒక్క గింజ ఎక్కువ తూకం వేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సరిపడా హమాలీ లని పెట్టుకొని కాంట ప్రక్రియ త్వరగా కావాలని, ప్రతీ కేంద్రానికి సరిపడా ట్రక్ లను ఏర్పాటు చేశామని, ఆలస్యం చేయకూడదని, వెంట వెంటనే కాంట అయిన ధాన్యం ట్రక్ లోకి లోడింగ్ చేపించాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ కూడా ఎప్పటికప్పుడు కావాలని, పెండింగ్ లో పెట్టకూడదన్నారు. మిల్లర్లు కూడా సరిపడా గోదాం లను ఏర్పాటు చేసుకొని, ట్రక్ లు రాగానే ఆన్ లోడింగ్ త్వరగా చేసుకోవాలని, కొనుగోలు కేంద్రాలలో ఉండే ధాన్యం త్వరగా మిల్ లకు చేరేలా సహకరించాలన్నారు.

## గద్దల నాగేందర్‌కు పిహెచ్‌డి డాక్టరేట్ ప్రదానం

- ములుగు మండలం పత్తిపల్లి వాస్తవ్యులు గద్దల లక్ష్మి బిక్షపతి కుమారుడు
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డాక్టరేట్ పొందడం జరిగింది
- డాక్టర్ గద్దల నాగేందర్



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా ములుగు మండలం పత్తిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ గద్దల నాగేందర్ వ్యవసాయ శాస్త్రం లోని అగ్రానమీ విభాగంలో పీహెచ్‌డీ పట్టా సాధించారు.ఆయన గద్దల లక్ష్మి,బిక్షపతి దంపతుల కుమారుడు.సోదరి డాక్టర్ రమ్య సైతం కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో మెడికల్ విద్యారంగంలో ముందుకు సాగుతున్నారు.నాగేందర్ తన ప్రాథమిక విద్యను ములుగులోని సాధన పాఠశాలలో పూర్తి చేసి, అనంతరం మామునూరు లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 10వ తరగతి వరకు విద్యను అభ్యసించారు. తరువాత హన్మకొండలోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాల యంలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశారు.బీఎస్సీ అనంతరం జెఆర్ఎఫ్ అర్హత సాధించి ఇందిరాగాంధీ కృషి విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ అగ్రికల్చర్ విద్యను అభ్యసించారు. ఐకార్ నిర్వహించిన ఎస్ఆర్ఎఫ్ కోసం ద్వారా పీహెచ్‌డీ ప్రవేశం పొంది, ఎస్ఆర్ఎఫ్ మెరిట్ స్కాలర్‌షిప్‌తో పరిశోధనలు కొనసాగించారు. ఎంఎస్సీ విద్యా పరిశోధనలో గోధుమ పంటలో కలుపు మొక్కల నియంత్రణ పద్ధతులు పంట వృద్ధి,దిగుబడిపై చూపే ప్రభావాన్ని అధ్యయనం చేశారు. పీహెచ్‌డీ పరిశోధనను అగ్రానమీ విభాగానికి చెందిన డా.జి.పి. బంజారా ప్రొఫెసర్, ప్రధాన మార్గదర్శకుల పర్యవేక్షణలో నిర్వహించారు. అలాగే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రిసెర్చ్ లో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్.మహేందర్ కుమార్ సహకారంతో పరిశోధనలు చేపట్టారు.డాక్టర్ గద్దల నాగేందర్ పరిశోధన ప్రధానంగా వరి సాగులో నీటి ఆదా,కార్మిక వ్యయం తగ్గింపు,సాగుఖర్చుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు దోహద పడే ఆధునిక సాగు విధానాలపై కేంద్రీకృతమైంది. ఈ పరిశోధనలో మిష్‌నైజ్డ్‌ఎస్ ఆర్ఐ(ఎంఎస్ఆర్ఐ), డైరెక్ట్ సీడెడ్ రైస్(డిఎస్ఆర్) సాధారణ నాట్లు(ఎన్ టిపి) పద్ధతులను పోల్చి అధ్యయనం చేశారు.ముఖ్యంగా ఆరుతడి పద్ధతిగా పిలిచే ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ (ఎడబ్ల్యుడి) విధానం ద్వారా వరి సాగులో నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని పరిశోధనలో వెల్లడైంది.ఈ విధానంలో వరి పొలంలో ఎప్పుడూ నీరు నిల్వ ఉంచకుండా అవసరమైన సమయంలో మాత్రమే నీటిని అందించడం ద్వారా గణనీయ మైన నీటి ఆదా సాధ్యమవుతుందని గుర్తించారు. డిఎస్ఆర్ డ్రమ్ సీడింగ్ పద్ధతి ద్వారా వ్యవసాయ కార్మికుల కొరత సమయంలో సైతం సకాలంలో విత్తడం సాధ్యమవుతుందని,సాగు ఖర్చు తగ్గుతుందని పరిశోధనలో తేలింది.నర్సరీ తయారీ,నాట్లు పీకడం, చేతితో నాట్లు వేయడం వంటి అధిక శ్రమ అవసరమైన పనులు తగ్గిపోవడంతో రైతులకు సమయం,ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే మిష్‌నైజ్డ్ ఎస్ఆర్ఐ విధానంలో కోనో వీడర్ వినియోగం ద్వారా కలుపు నియంత్రణను తక్కువ ఖర్చుతో సకాలంలో సమర్థవంతంగా నిర్వహించ వచ్చని వెల్లడించారు.దీంతో కార్మికులపై ఆధారపడటం తగ్గడమే కాకుండా నేలలో గాలి ప్రసరణ మెరుగై వేర్ల వ్యవస్థ అభివృద్ధికి సైతం దోహద పడుతుందని తెలిపారు. అదేవిధంగా ఎడబ్ల్యుడి విధానాన్ని అనుసరించడం వల్ల భూగర్భ జలాల వినియోగం, విద్యుత్, డీజిల్ ఖర్చులు తగ్గడంతో పాటు వరిపొలాల నుండి విడుదలయ్యే మీథేన్ వాయువు ఉద్గారాలు సైతం తగ్గుతాయని పరిశోధనలో వెల్లడైంది.తక్కువ నీరు,తక్కువ కార్మిక వ్యయం,తక్కువ సాగు ఖర్చుతో అధిక దిగుబడిని అందించే సుస్థిర వ్యవసాయ పద్ధతులపై చేసిన ఈ పరిశోధన రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.డాక్టర్ గద్దల నాగేందర్‌కు పీహెచ్‌డీ పట్టాను ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి,ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్ర గవర్నర్ రమేన్ దేకా, ఛత్తీస్‌ఘఢ్ వ్యవసాయ శాఖ మంత్రి రామ్ విచార్ నేతమ్,ఇందిరాగాంధీ కృషి విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ గిరీష్ చందేల్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.కె సింగ్ సమక్షంలో ఇటీవల ప్రదానం చేశారు.తన విజయానికి తల్లిదండ్రులు గద్దల లక్ష్మి –బిక్షపతి చేసిన త్యాగాలు,కష్టం, ప్రోత్సాహమే ప్రధాన కారణమని డాక్టర్ గద్దల నాగేందర్ భావోద్వేగంతో తెలిపారు. మా నాన్న ఆర్టిస్ట్ గా రమ్య ఆర్ట్స్ అనే పేరుతో గత 30 ఏళ్ళుగా కష్టపడ్డారని,ఇప్పటికీ కష్టపడుతున్నారని,తాను ఫ్లెక్సీలు రాకా ముందు ఎన్నో షాపుల ముందు షాపుల నేమ్ బోర్డులు, వాల్ రైటింగ్ చేస్తూ ఎంతో కష్టపడి తనను మా చెల్లి రమ్యను ఉన్నత చదువులు చదివించారని,మా చెల్లి ప్రస్తుతం నల్గొండ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ చదువుతుందని అన్నారు. కుటుంబ సభ్యులు,తన గురువులు,స్నేహితుల సహకారం తోనే ఈ విజయం సాధించానని ఆనందం వ్యక్తం చేశారు.తమ కుమారుడు ఉన్నతస్థాయికి చేరుకోవాలని కలలు కని,ప్రతి అడుగులో అండగా నిలిచిన తల్లిదండ్రుల ప్రేమ, ఆశీస్సులు, సహకారమే తన విజయానికి బలమని పేర్కొన్నారు.

## గంగపుత్రులను అధికారికంగా గుర్తించాలని ఆర్డీవోకు వినతి పత్రం

- బీసీఏలో ముదిరాజులను చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నాం
- పట్టణ గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుంటి సంజీవ



**నర్సంపేట మే 19 (ప్రజాజ్యోతి) :** నర్సంపేట పట్టణంలోని గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుంటి సంజీవ ఆధ్వర్యంలో గంగ పుత్రులు ఆర్డిఓ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుంటి సంజీవ మాట్లాడుతూ బెస్త, గంగపుత్ర కులస్తులను ఈమధ్య ప్రకటించిన సమగ్ర సర్వేలో ప్రభుత్వం జనాభా లెక్కల్లో చూపెట్టలేదని, ఉపకులాలుగా చూపెట్టడం జరిగిందని అన్నారు. బెస్త గంగపుత్రం కులాలు, ఉప కులాలు కాదని గుర్తు చేశారు. గంగపుత్రులేని సమాజాన్ని ఊహించుకోలేమని, గంగపుత్రులం చేపలు పట్టుకొని జీవించే వారమని, అనాదిగా మాది ఇదే వృత్తి అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బెస్త, గంగపుత్ర కులాలను అధికారికంగా ప్రకటించాలని కోరారు. తెలంగాణలో ఐదు ఆరు లక్షల జనాభా ఉన్న గంగపుత్రులను చూపెట్టకపోవడం చాలా బాధాకరమని అన్నారు. అదే విధంగా బీసీడీలో ఉన్న ముదిరాజులను బిసిఏ లో కలపడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను వ్యతిరేకించారు. సంపన్న వర్గానికి చెందిన ముదిరాజులు బీసీఏలోకి వస్తే బీసీ ఏ లో ఉన్న 57 కులాలు వారి ప్రాతినిధ్యం కోల్పోతారని ఉనికి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే బీసీఏ లో ఉన్న కులాలకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఆదరణ లేకుండా వెనుకబడి ఉన్నామని, మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు, ప్రభుత్వం తన నిర్ణయం వెనక్కి తీసుకోబోకపోతే బీసీ ఏ కులాలు భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎర్రబోయిన కిషన్, జిజుల సాగర్, చింతల టార్జాన్,అంకాల మల్లికార్జున్, అంకాల సురేష్, పూస ఏకాంబరం, మేదరబోయిన శ్రీనివాస్, కాపర బోయిన రమేష్,గుంటి శ్రీనివాస్, అంబటి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు శాస్త్రవేత్తల అవగాహన

- వంట మార్పిడి విధానం ద్వారా స్థిర ఆదాయాన్ని పొందవచ్చు
- నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పచ్చి రొట్టె ఎరువులు వాడు కోవాలి - శాస్త్రవేత్తలు జి శేషు, ఎం మధు

**రాయపర్తి మే 19 ప్రజా జ్యోతి :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు, వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని రాయపర్తి మండలం, జగన్నాథ పల్లె గ్రామంలో మంగళవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా.జి.శేషు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ యూనివర్సిటీలో అభివృద్ధి చేసిన నాణ్యమైన వరి, అపరాల విత్తనాలను వేసుకుంటే పురుగులు, తెగుళ్ళు తక్కువగా ఆశిస్తాయని తద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. అలాగే మార్కెట్లో డిమాండ్ ఉన్న యూనివర్సిటీ వరి మరియు అపరాల రకాల గురించి తెలియజేశారు. రైతులు తమ పొలంలో పండించిన రకాలను జాగ్రత్తలు పాటించి రెండు, మూడు సంవత్సరాల వరకు విత్తనంగా ఉపయోగించుకోవచ్చని, అలాగే విత్తనం మీద పెట్టే ఖర్చులు తగ్గించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో తరువాత డా.ఎం.మధు, శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతు సోదరులకు ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా యూరియా వాడకాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని, పంట మార్పిడి పాటించడం ద్వారా స్థిర ఆదాయం పొందవచ్చునని, మార్కెట్లో లాభసాటిగా ఉన్న వరి రకాలను పండించడం, వివిధ పంటల్లో సాగునీటిని ఆదా చేసే అవసరమైన పరిజ్ఞానాన్ని, ప్రత్యామ్నాయ పంటల వివరాలను, సేంద్రీయ పద్ధతులపై అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లి పెసరను వేసుకోవాలని తెలిపారు. వరి పంట వేసుకునే ముందు మే నెల చివరలో లేదా జూన్ మొదటి వారంలో పచ్చిరొట్ట పంటలను వేసుకొని పూత దశలో భూమిలో కలియదున్నాలని సూచించారు, అలాగే పత్తి పంట తీసిన తర్వాత పెసర మినుము లేదా శనగ పంటలను సాగు చేయాలని సూచించారు. తర్వాత వ్యవసాయ విస్తరణ అధికారి కె.క్రాంతి మాట్లాడుతూ ప్రతి రైతు వారికి ముందు పచ్చి రొట్టె ఎరువులను సాగు చేసుకోవాలని సూచిస్తూ, వేసుకున్న జీలుగా మరియు జనుము లాంటి పంటలు అందులో కొంత భాగం విత్తనోత్పత్తిగా చేసి ఆ విత్తనాన్ని మళ్లీ తర్వాత సంవత్సరంలో వినియోగించుకోవాలని తెలియజేశారు.పంటల అవశేషాలు కాల్చవద్దు అని కొరారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ పల్లె గ్రామ ఎం.పీ.ఓ: కే.ప్రకాష్ మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు పాటించి మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని రైతులను కోరడం జరిగింది. గ్రామ సర్పంచ్ :బి.సుగుణమ్మ, ఉపసర్పంచి:జి. శ్రీను, వ్యవసాయ శాఖ అధికారి: వీరభద్రంఎం.పీ.ఓ.: కే. ప్రకాష్ ఏ ఈ వో:క్రాంతి కుమార్ పంచాయతి కార్యదర్శి:పద్మానాభస్వామి జిపిఓ: ఏ. రాధిక, వార్డు సభ్యులు మరియు 45 మంది గ్రామ రైతులు పాల్గొన్నారు.







## ఇండ్ల గణన ప్రక్రియ పారదర్శకంగా, కచ్చితంగా జరగాలి

ల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మే 19 (ప్రజాజ్యోతి) :** జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జనగాం మండలం పెద్ద పహాడ్, జనగాం మున్సిపాలిటీ లోని 13వ వార్డులో జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియని మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్యూమరేటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంటింటి సర్వే సక్రమంగా, పారదర్శకంగా జరిగేలా చూడటం ఎన్యుమరేటర్ల ప్రధాన బాధ్యత అని తెలిపారు. నిర్దేశిత నిబంధనల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా స్పష్టమైన, కచ్చితమైన వివరాలను సేకరించాలాన్నారు. మొదటి దశలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల గణన నిర్వహిస్తారని, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎండాకాలం నేపథ్యంలో ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజలు కూడా ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు ఎలాంటి దాపరికం లేకుండా ఖచ్చితమైన సమాధానాలు చెప్పాలని, దీనివల్ల ప్రభుత్వానికి సరైన లెక్కలు అందుతాయన్నారు.

## బస్సు ప్రయాణంలో ఎస్.ఎస్.సి మెమో పోగొట్టుకున్న యువకుడు.. పోలీసులకు ఫిర్యాదు



**నర్సంపేట, మే 19 (ప్రజాజ్యోతి) :** నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామ పరిధిలోని ఏనుగల్లు తండకు చెందిన బానోత్ కార్తిక్ తన ఎస్ఎస్సి మెమో పోగొట్టుకున్న ఘటనపై నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న పని నిమిత్తం నర్సంపేట పట్టణానికి వెళ్లిన ఆయన తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో బస్సులో ప్రయాణిస్తుండగా తన వద్ద ఉన్న ఎస్ఎస్సి మెమో కనిపించకుండా పోయిందన్నారు. ఇంటికి చేరుకున్న తర్వాత సర్టిఫికెట్ కనిపించకపోవడంతో బస్సు, ప్రయాణ మార్గం సహా పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. విద్యా, ఉద్యోగ తదితర అవసరాలకు ఎస్ఎస్సి మెమో కీలకమైన పత్రం కావడంతో వెంటనే పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. డూప్లికేట్ ఎస్ఎస్సి మెమో పొందేందుకు అవసరమైన పోలీస్ ధృవీకరణ పత్రం అందించాలని పోలీసులను కోరినట్లు, ఇందుకు కావలసిన అఫిడవిట్ కూడా సబ్మిట్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు ఫిర్యాదు స్వీకరించి విచారణ చేపట్టినట్లు తెలిసింది.

## కల్తీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారికి తెలంగాణ రైతు రక్షణ సమితి వినతి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 19, (ప్రజాజ్యోతి) :** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు కల్తీ విత్తనాల మోసం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్‌రావు ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వరికెల కిషన్‌రావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగుకు రైతులు విత్తనాల కొనుగోళ్లకు సిద్ధమవుతున్న తరుణంలో కొందరు దళారులు, అక్రమ వ్యాపారులు కల్తీ విత్తనాలను విక్రయించి రైతులను మోసం చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాంటి ఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలోని విత్తన దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, లైసెన్స్ లేని దుకాణాలపై చర్యలు తీసుకోవాలని, కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాల గుర్తింపు, కొనుగోలు విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ పాల్గొన్నారు.

## బాలాజీ రైస్ మిల్ ఆకస్మిక పరిశీలన

### ధాన్యం త్వరితగతిన దిగుమతి చేసి భద్రపరచాలని జిల్లా డిప్యూటీ సీఈవో శిరీష ఆదేశం

మునగాల మే 19 (ప్రజా జ్యోతి): మునగాల మండలం పరిసర ప్రాంతంలో ఉన్న బాలాజీ రైస్ మిల్లును మునగాల మండల ప్రత్యేక అధికారి, జిల్లా డిప్యూటీ సీఈవో శిరీష ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో జరుగుతున్న ధాన్యం దిగుమతి, నిల్వ మరియు మిల్లింగ్ ప్రక్రియలను ఆమె స్వయంగా పరిశీలించి యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని లారీలలో ఎక్కువసేపు నిల్వ



ఉంచకుండా వెంటనే దిగుమతి చేసి భద్రపరచాలని ఆదేశించారు. ఆలస్యం జరిగితే ధాన్యం నాణ్యత దెబ్బతినే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైస్ మిల్ యాజమాన్యంతో మాట్లాడిన శిరీష, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ధాన్యం నిల్వలు నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించడంతో పాటు, రవాణా మరియు నిల్వ వ్యవస్థను మరింత వేగవంతం చేయాలని సూచించారు. అలాగే మిల్లులో కార్మికుల భద్రత, పరిశుభ్రత చర్యలను కూడా పరిశీలించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, దీన్ దయాల్, ఆర్ఐ రామారావు, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తుంగతుర్తిలో కోర్టు భవన నిర్మాణానికి నిధుల మంజూరు పట్ల హర్షం

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, అన్నెపర్తి జ్ఞాన సుందర్

తుంగతుర్తి, మే 19, (ప్రజా జ్యోతి): మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.29కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ... గతంలో నిధులు మంజూరు చేసి నిలిచిపోవడంతో మళ్లీ రీటెండర్ చేసి నిధులు మంజూరు



చేయడం జరిగిందన్నారు. భవన నిర్మాణాన్ని నాణ్యవంతంగా నిర్మించేందుకు నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. కోర్టుకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసే విధంగా చూస్తామన్నారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కారింగుల వెంకటేశ్వర్లు, జిల్లా కుమారస్వామి, మల్లెపాక రవికుమార్, భాషబోయిన వేణురాజు, పూల్ సింగ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సౌనమ్మ పండుగలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గాదరి

తుంగతుర్తి మే 19,(ప్రజా జ్యోతి): గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సౌనమ్మ పండుగ వేడుకలు మండల పరిధిలోని అన్నారం గ్రామంలో మంగళవారం





ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి సందడి చేశారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. . . గ్రామీణ ఆచారాలు మరియు పండుగలు మన సంస్కృతికి ప్రతిబింబమని, యువత సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. ఈ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ మండల మరియు గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పటివరకు జిల్లాలో 2.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

### ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

తుంగతుర్తి మే 19(ప్రజా జ్యోతి): వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని దాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు.మంగళవారం తుంగతుర్తి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇప్పటివరకు దాదాపుగా జిల్లాలో 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు.అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అన్ని కేంద్రాల్లో హమాలీలు, లారీ కొలతలు లేకుండా అన్లోడింగ్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తిచేసే విధంగా చూస్తామని వివరించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అన్నారు, రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి లారీల్లో మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. లారీల కొరతతో ధాన్యం తరలింపు జరగడంలేదని కేంద్రాల నిర్వాహకులు కలెక్టర్



దృష్టికి తీసుకువచ్చారు. వారి వెంట తహశీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, ఎంపీఓ, వ్యవసాయ శాఖ ఏడిఏ రమేష్ బాబు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

## ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి

నడిగూడెం ,మే 19, ప్రజా జ్యోతి: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి రైతు తమకున్న వ్యవసాయ భూమిలో తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని తహసీల్దార్ సోంపంగు సూరయ్య కోరారు.

మంగళవారం వల్లాపురంలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చే ఖరీఫ్ సీజన్ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం పై రైతు చైతన్య యాత్రను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. గత 65 ఏళ్లుగా చేస్తున్న రసాయన వ్యవసాయం తో భూసారం దెబ్బతిన్నదన్నారు. కాబట్టి భూసారం పెరగాలంటే ఇప్పటి నుండే ప్రతి రైతు నేలకు పశువుల పెంట, చెరువు మట్టి తోలుకోవాలన్నారు. తొలకరి వర్షాలు కురవగానే జీలుగ, పిల్లి పెసర, జనుము లాంటి పచ్చి రొట్ట పంటలను సాగుచేసుకోవాలన్నారు. అనంతరం ఎస్ ఐ గంధమళ్ళ అజయ్ కుమార్ మాట్లాడుతూ వరి కొయ్యకాలకు కొందరు రైతులు తెలియక నిప్పంటిస్తున్నారన్నారు.

దీంతో నేలలో పంటకు, నేలకు మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయాన్నారు. నేల ఆరోగ్యమే పంట అని పంట ఆరోగ్యమే మన ఆరోగ్యమన్నారు. అనంతరం పల్లెదవాఖానా వైద్యాదిధికారి డాక్టర్ గార్లపాటి హరినాథ్ మాట్లాడుతూ మనిషి జీవితం ప్రకృతితో ముడిపడి ఉందన్నారు. కాబట్టి ప్రతి రైతు సహజ సిద్ధ వ్యవసాయం పై మొగ్గు చూపాలన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కేసగాని సరిత, పంచాయతీ




కార్యదర్శి రనబోతు మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట శేఖర్ రెడ్డి, డాక్టర్ కేసగాని లక్ష్మణ్, ఆదర్శ రైతులు బజ్జూరి వీరా రెడ్డి, బజ్జూరి అచ్చి రెడ్డి, పల్లా యూగేందర్ రెడ్డి, పల్లా వెంకటరెడ్డి,అప్పి రెడ్డి, నిందుచర్ల వెంకటేశ్వర్లు,దుస్సా వెంకటేశ్వర్లు, నారాయణ రెడ్డి, నూకపంగు వెంకన్న, నూకపంగు ఈదయ్య, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతో కుష్టు వ్యాధి నివారణ

### వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి

తుంగతుర్తి మే 18 (ప్రజా జ్యోతి): అవగాహన పెంచుకోవడం ద్వారా కుష్టు వ్యాధిని కొంతవరకు



నివారించవచ్చని రావుల పెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి అన్నారు, మంగళవారం మండల పరిధిలోని సూర్య తండా, జీకే తండా లో కుష్టు వ్యాధి పై ఇంటింటి సర్వే నిర్వహించారు, మేరకు గ్రామంలో 184 గృహాల్లో 742 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు దీనిలో భాగంగా ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి కుష్టు వ్యాధి లక్షణాలపై పరిశీలన చేపట్టడంతో పాటు ప్రజలకు వ్యాధి లక్షణాలు, ప్రారంభ దశలో గుర్తింపు, చికిత్స మరియు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు, తదుపరి చికిత్స కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు, రెండు రోజులు సర్వే కార్యక్రమంలో మొత్తం 184 గృహాలను సందర్శించి, 742 మంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు , కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, వ్యాధి పట్ల అపోహలు లేకుండా లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి సర్వేలు వ్యాధి నిర్మూలనకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రావులపల్లి డిపిఎమ్ఓ లు సురేష్ కుమార్, సురేష్ బాబు, అనిల్ కుమార్, కృష్ణయ్య, పి హెచ్ ఎన్ మాణిక్య, ఏఎన్ఎం భారతి, శైలజ, ఆరోగ్య సహాయకులు యాదగిరి, నరసింహ చారి, ఆశా కార్యకర్తలు జె. విమల కె. సరిథ జి. కమల తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు..

**ఫుట్‌పాత్‌లపై 'రెడ్ లైన్' మార్కింగ్!**

**రంగ థియేటర్ నుండి శ్రీనివాస్ థియేటర్ వరకు**

**పురపాలక సిబ్బందితో కలిసి ట్రాఫిక్ పోలీసుల చర్యలు**

**గీత దాటితే కఠిన చర్యలు తప్పవు**

**ట్రాఫిక్ ఎస్ఐ బి. అంజిరెడ్డి హెచ్చరిక**

కోదాడ టౌన్,మే 19 (ప్రజా జ్యోతి): కోదాడ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు




మరియు పాదచారుల రక్షణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మంగళవారం మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో సూర్యాపేట రోడ్డులో ముమ్మరంగా 'ఆపరేషన్ రోప్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి. అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఈ విస్తృత తనిఖీలు చేపట్టారు.సూర్యాపేట రోడ్డులోని ప్రధాన కూడలి అయిన రంగ థియేటర్ పరిసరాల నుండి శ్రీనివాస్ థియేటర్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న అక్రమ ఆక్రమణలపై అధికారులు ఉక్కుపాదం మోపారు.ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, దుకాణాల ముందరి బోర్డులు, ఇతర సామాగ్రిని మున్సిపల్ సిబ్బంది సహాయంతో అక్కడికక్కడే తొలగించారు. రోడ్డుపై వాహనాల రాకపోకలకు, పాదచారుల నడకకు అడ్డుగా ఉన్న తాత్కాలిక నిర్మాణాలను తొలగించి మార్గాన్ని సుగమం చేశారు.

**హద్దు దాటితే చర్యలు:**

ఆక్రమణల తొలగింపు అనంతరం వ్యాపారులు మళ్లీ రహదారి పైకి రాకుండా ఉండేందుకు అధికారులు ఫుట్‌పాత్ అంచు వెంబడి ప్రత్యేకంగా ఎరుపు రంగు గీత మార్కింగ్ వేశారు.వ్యాపారస్తులు ఎవరైనా సరే తమ సామాగ్రిని లేదా తోపుడు బండ్లను ఈ రెడ్ లైన్ దాటించి ముందుకు తీసుకురాకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ బి. అంజిరెడ్డి మాట్లాడుతూ,పట్టణంలో సురక్షితమైన ప్రయాణానికి, ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా, కేటాయించిన హద్దుల లోపలే తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. ఈ హద్దు రెడ్ లైన్ గీత దాటి రోడ్డుపైకి





వస్తే సామాగ్రిని జప్తు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో కోదాడ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్తు శ్రీనివాస్, నరహరి, పోలీస్ సిబ్బందితో పాటు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సూరోజు తిరుపతయ్య జ్ఞాపకార్థం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

మోత్కూరు, మే 19 (ప్రజా జ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ యాదాద్రి భువనగిరి వారి ఆధ్వర్యంలో తెలంగాణ ఫ్రీడమ్ ఫైటర్, స్వాతంత్ర సమరయోధులు సూరోజు తిరుపతయ్య శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వారి పేరుపై ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణము మోత్కూర్ నందు




మంగళవారం సుమారు 800 మంది ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజా భారతి, టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయులు, ఏఎస్ఐ నరసింహ, ఇండియన్ రెడ్ క్రాస్ డైరెక్ట్ లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, సోమ నరసింహ చారి, అంజయ్య, బి.మచ్చగిరి, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి వెంకటాచారి, దర్శనం వెంకన్న, యామగాని బుగ్గయ్య, సూరోజు భాస్కరాచారి, కోడలు యాదమ్మ, కుమారుడు లక్షణాచారి తదితరులు పాల్గొన్నారు.

## సంజీవరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

### ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆలేరు మే 19 ప్రజా జ్యోతి: సంజీవరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని తేర్యాల కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు గంగుల సంజీవరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం ఎన్నో సంవత్సరాలు కృషి చేసిన సంజీవరెడ్డి లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంగపురం మల్లేష్, గ్రామ సర్పంచ్ మంత్రి లతా స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఎస్ పి ఎఫ్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

నాగార్జునసాగర్,మే,19 ప్రజా జ్యోతి: నాగార్జునసాగర్ నందికొండ పట్టణం లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ ఎస్ పి ఎఫ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు,





మజ్జిగను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ పి ఎఫ్ నాగార్జునసాగర్ విభాగం అసిస్టెంట్ కమాండెంట్ బి రాజు మాట్లాడుతూ ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా,జోన్ డిఐజి మాధవరావు సూచనల మేరకు నాగార్జునసాగర్ లోని కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు,మజ్జిగను పంపిణీ చేశామన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 కార్యక్రమంలో భాగంగా సాగర్ ఎస్ పి ఎఫ్ విభాగం రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్,10కె రన్ లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకతను చాటుకుందాన్నారు.మంగళవారం నిర్వహించిన పండ్లు పంపిణీ కార్యక్రమంలో కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ హరికృష్ణ,జెన్కో ఎస్ పి ఎఫ్ ఆర్ ఐ ప్రతాప్ నాయుడు,నాగార్జునసాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ ఆర్ ఐ శ్రీనివాసరావు,జెన్కో మరియు సాగర్ డ్యాం ఎస్పీఎఫ్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ శాఖ అధికారులు
# రైతులకు వివిధ అంశాలపై అవగాహన




**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి న్యూస్ ) మే. 19** ఇందల్వాయి మండల కేంద్రంలోని అంగల్వాయి గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని 30 ఏప్రిల్ 2026 నుండి 23 మే 2026 వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి గ్రామం లో చెరుకు వరి పరిశోధనా స్థానం రుద్రూరు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో లాభదాయకత పెంచే ందుకు రైతులు పద్ధతులను అనుసరించడం అవసరం. యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఖర్చులను నియంత్రించవచ్చు. ముఖ్యంగా యూరియా వినియోగాన్ని అవసరానికి మించి వేయకుండా పరిమితం చేయాలి . అధికంగా యూరియా వాడడం వల్ల నేలలోని సహజ పోషకాలు దెబ్బతిని పంటల దిగుబడి పై ప్రతికూల ప్రభావం పడుతుంది అని తెలిపారు. కాబట్టి సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా ఖర్చులను తగ్గించడంతోపాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. రాబోయే వానాకాలం సీజన్లో ముఖ్యంగా రైతులు ప్రభుత్వం సూచించిన 8 సన్న రకాల వరి వంగడాలు అయిన బిపిటి -5204, ఆర్ ఎన్ ఆర్ -15048, కే ఎన్ ఎం -1638, జైశ్రీరామ్ హెచ్ఎంటి డబ్ల్యూ జి ఎల్ 962, డబ్ల్యూ జి ఎల్ -44, జేజీఎల్ -1798, దొడ్డు రకాలు అయిన ×=-64, ఎం టి యు -1010, కే ఎన్ ఎం -118 రకాలు మాత్రమే వేయాలని మాట్లాడడం జరిగినది, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రకాష్ గౌడ్ మరియు చెరుకు వరి పరిశోధనా స్థానం రుద్రూరు శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య , గ్రామ సర్పంచ్ శ్రీమతి గంగామణి గంగారం , ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ గ్రామ అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కల్లుగీత కార్మికుల సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్‌ను సన్మానించిన ఆలయ కమిటీ




**నిజామాబాద్ ప్రజాజ్యోతి మే 19** మోపాల్ మండలం బొర్గం గ్రామంలోని సంజీవరెడ్డి నగర్ కాలనీలోని శ్రీ లవకుశ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కల్లు గీత కార్మికుల సహకార కార్పొరేషన్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన శేఖర్ గౌడ్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనముగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు ఈగ సంజీవ రెడ్డీ, శేకర్ గౌడ్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగ సంజీవ రెడ్డి మాట్లాడుతూ సౌమ్యుడు, అందరికి అందుబాటులో వుండే శేఖర్ గౌడ్ కు చైర్మన్ పదవి రావడం అయన కష్ట పలమని అన్నారు. ముందు మరిన్ని పదవులు ఆశించాలని ఆయన అన్నారు. అలాగే కమిటీ ఆధ్వర్యంలో బోర్గం గ్రామానికి చెందిన అశోక్ కు కార్పొరేషన్ లో కో ఆప్షన్ మెంబర్గా నియామకమైన సందర్భంగా ఆయనను కూడా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఆలయానికి, గ్రామానికి తన చేతనైన సహాయ సహకారాలు అందిస్తానని దేవాలయ, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. శ్రీ లవకుశ ఆంజనేయ స్వామి ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. అలాగే నూతన నూతనంగా ఎన్నుకోబడ్డ కోఆప్షన్ మెంబర్ అశోక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో కృషి చేస్తానని అలాగే దేవాలయ అభివృద్ధి కోసం కూడా పాటుపడతారని ఆయన అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజేంద్రప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈగ నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి, కోశాధికారి అజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి, అజయ్ రెడ్డి, కృష్ణారెడ్డి, బాల్ రెడ్డి, బోర్గం గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షులు ఈగ రమేష్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

### మంచిప్ప గాలివాన బీభత్సం పై
# ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆరా.. ఆందోళన చెందవద్దని భరోసా

- గాలివాన కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, నేలకొరిగిన చెట్లు
- దెబ్బతిన్న ఇండ్లు.. అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే





**నిజామాబాద్ రూరల్ (ప్రజా జ్యోతి ) మే 19** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధి మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో గ్రామంలో భారీ వృక్షాలు నేలకూలాయి, గ్రామస్తులకు చెందిన పలువురి ఇళ్లు దెబ్బతినడంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏపీ పర్యటన నిమిత్తం బయలుదేరిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి.. సంబంధిత విద్యుత్,రెవెన్యూ , వ్యవసాయ తదితర శాఖల అధికారాలతో ఫోన్లో మాట్లాడారు.. పలు వివరాలు అడిగి తెలుసుకొని తక్షణ చర్యలకు పలు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన చెట్లను వెంటనే తొలగించేల తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అటు మంచిప్ప సర్పంచ్ గంగామణి-రాజేష్ తో మాట్లాడి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని నష్టపోయిన వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కాగా గ్రామంలో కొన్ని ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఐతే ఇండ్లు కోల్పోయిన వారికి అండగా ఉంటామని ఎవరు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే తెలిపారు.

# నేడు రుద్రూర్‌లో మెడికల్ షాపుల బంద్

- తహసీల్దార్, ఎస్సైకి వినతిపత్రాలు అందజేత




**రుద్రూర్ ,మే19(ప్రజా జ్యోతి):** కేంద్ర ప్రభుత్వం 2018లో ఆన్ లైన్ లో మందుల అకమ్మకాల కోసం తెచ్చిన జీఎస్ఆర్ 817,అలాగే కార్పొరేట్ వారికి ప్రత్యేక డిస్కౌంట్లు,నాసిరకం మందులు, మార్కెట్లోకి వస్తున్న వాటిపై కేంద్ర ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినప్పటకి స్పందించక పోవడంతో బుధవారం మందుల దుకాణాలు బంద్ పాటిస్తున్నట్టు నిజామాబాద్ జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అ ధ్యక్షులు నల్ల మదుసుధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీర్కూర్ సుధాకర్ వెల్లడించారు.ఈ సందర్భంగా రుద్రూర్ గ్రామ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ తారాబాయి,ఎస్సై సాయన్నకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ జాతీయ సంస్థ అయిన ఏఐవోసీడి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఒకరోజు బంద్ పాటిస్తున్నట్టు వెల్లడించారు.రాష్ట్ర సంస్థ అయిన టీటీడీసీఏ నిర్వహించిందని పేర్కొన్నారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభాకర్,సంతోష్, శంకర్,సుధీర్,అడప శంకర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### చిన్న మల్లారెడ్డి గ్రామంలో ఎనిమిదవ వార్డులో
# పాత బావి వద్ద చెత్త తొలగింపు పనులు

- ■ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- ■ వార్డు సభ్యులు కమ్మరి స్వామి శ్రీనివాస్
- ■ సర్పంచ్ బీమాయల లక్ష్మీ రాజు



**కామారెడ్డి రూరల్, మే 19 (ప్రజా జ్యోతి):** కామారెడ్డి మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామ 8వ వార్డులో ఉన్న పాత బావి పరిసర ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను మంగళవారం ప్రత్యేకంగా శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వార్డు మెంబర్ కమ్మరి స్వామి శ్రీనివాస్ తెలిపారు. పాత బావి చుట్టూ చాలా రోజులుగా పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించి పరిసరాలను పూర్తిగా పరిశుభ్రం చేశారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భీమయ్యల లక్ష్మి రాజు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రతి వార్డులో శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు, యువకులు పాల్గొని శుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో
# తాగి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష




**ఇందల్వాయి ప్రజాజ్యోతి మే. 19** ఇందల్వాయి మండల కేంద్రంలోని గత వారం రోజుల క్రితం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన 1) భూక్యా హరిచంద్ తండ్రి పేరు వసారామ్ , వయస్సు:45 సంవత్సరాలు, కులం: ఎస్టి లంబాడా సొంత ఊరు మిట్టపల్లి గ్రామం, డిచ్పల్లి మండలం. అతనిని ఈరోజు కోర్టులో హాజరుపరచగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ( స్పెషల్ ఎక్సైజ్ కోర్ట్ )న్యాయమూర్తి అహ్మద్ నిజామాబాద్ 7 రోజులు జైలు శిక్ష విధించడం జరిగింది. తాగి వాహనాన్ని నడపడం చట్టరీత్యా నేరం కావున తాగి వాహనాలు నడపకండి.

# నేటి నుంచి సమ్మె బాటలో ఐకెపి వివోఏలు




**సిరికొండ( ప్రజాజ్యోతి) మే 19** సిరికొండ మండల కేంద్రంలో ఐకెపి వివోఏలు సమ్మె బాట పట్టారు. సిరికొండ మండల కేంద్రంలో వివో ఏల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి వివోఏల, మండల అధ్యక్షుడు మూన్ సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కే మనోహర్ రెడ్డి కి, ఎస్సై రామకృష్ణ, ఐకెపి ఏపిఎం సువర్ణకు సమ్మె నోటీసులు అందించారు అనంతరం వారికి తమ డిమాండ్లను తెలియజేశా ఐకెపి వివో ఏల జీతం 26,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా జగుర్తించి హెచ్ఆర్ పాలసీ ఇవ్వాలని అర్హులైన వివో ఏ లను సీసీలుగా నియమించాలని, 20 లక్షల సాధారణ భీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని, ప్రతి గ్రామా సంఘానికి ట్యాబు నెట్ సౌకర్యం కల్పించాలని జీవో నెంబర్ 58 సవరించాలని, సెర్ప్ నుండి వివో ఏల ఐడెంటి కార్డు ఇప్పించాలని జాబ్ చార్ట్ ఇవ్వాలని ఐకెపి వివో ఏలు జీతాల పెంపు, ఇతర దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని లేనియెడల ఐకెపి వివో ఎలా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దశలవారీగా ప్రోగ్రాంలతోపాటు సమ్మెలోకి వెళ్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఐకెపి వివో ఏలు సునీత, లావణ్య, శ్యామల, రాకేష్ భూలక్ష్మి లలిత మండల వివోఏలు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో
# వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు


- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష
- రూ.2 వేల జరిమానా విధించిన కోర్టు
- రాజంపేట పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడ్డ రైతు
- యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన



**కామారెడ్డి రూరల్, మే 19 (ప్రజా జ్యోతి):** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాజంపేట పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... రాజంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో శేర్ శంకర్ తండా గ్రామానికి చెందిన ముద్రిచ రాజేశ్వర్ (45) అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. తండ్రి సోంలా కాగా, వ్యవసాయం వృత్తిగా కొనసాగిస్తున్నాడు. పోలీసులు నిర్వహించిన ఆల్కహాల్ పరీక్షల్లో అతని బి ఏ సి స్థాయి 370 ఏం జి/100 ఏం ఎల్ గా నమోదైంది. సాధారణ స్థాయికి మించి అధికంగా మద్యం సేవించినట్లు పరీక్షల్లో తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును రాజంపేట ఎస్సై బి. మహేష్ దర్యాప్తు చేసి నిందితుడిని గౌరవనీయ ×× క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ టి. చంద్రశేఖర్ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి రెండు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.ఈ సందర్భంగా రాజంపేట పోలీసులు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల డ్రైవర్ ప్రాణాలతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని తెలిపారు.ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాహనం నడపాల్సిన పరిస్థితిలో మద్యం సేవించకూడదని, ఒకవేళ మద్యం సేవించినట్లయితే కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా ఇతర సురక్షిత మార్గాల ద్వారా ఇంటికి చేరుకోవాలని సూచించారు.రోడ్డు భద్రత కోసం డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉ ఒడదని రాజంపేట పోలీసులు స్పష్టం చేశారు.

### బక్రీద్ పండుగ సందర్భంగా
# పీస్ కమిటీ సమావేశం నిర్వహణ





**కామారెడ్డి ప్రతినిధి మే 19. (ప్రజాజ్యోతి)** ఈ నెలలో రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లా శాంతి భద్రతలు, పండుగ ఏర్పాట్ల పై సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగను సామరస్య వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.మసీదులు, ఈద్గాలు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పండుగ సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో, సామాజిక బాధ్యతతో వ్యవహరించి శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరసింహా రెడ్డి , అదనపు కలెక్టర్ విక్టర్ , మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్
# ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**రుద్రూర్,మే19(ప్రజా జ్యోతి) :**రుద్రూర్ మండల కేంద్రంలో రైడ్స్ సంస్థ వారు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులలోని విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ రుద్రూర్ వారి సహకారంతో లయన్స్ కంటి ఆసుపత్రి బోధన్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో దాదాపు 90 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను రాసి ఇవ్వడం జరిగింది.అదేవిధంగా విద్యార్థులకు పండ్లు,బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. విద్యార్థులకు రాబోయే కాలంలో వారు ఎదగడాని కొరకు మోటివేషన్ క్లాస్ ని నిర్వహించడం జరిగింది. సీనియర్ లయన్స్ సభ్యులు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్ మోటివేషన్ క్లాస్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు గుండూరు ప్రశాంత్ గౌడ్,లయన్ కె.వి మోహన్,లయన్ సీనియర్ సభ్యులు లయన్ ఇందూర్ చంద్రశేఖర్,లయన్ శ్యామ్ సందర్ పహాడే,ప్రవీణ్ కారంగుల,లయన్ గెంటీల గంగాధర్,లయన్ ప్రశాంత్ పార్వతి,ఇతర లయన్స్ సభ్యులు, లయన్స్ కంటి ఆసుపత్రి బోధన్ వైద్యులు అజయ్,కోఆర్డినేటర్ హనుమంతరావు,రఫీ,రైడ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రామోజీ ఫిల్మ్ సిటీకి
# 70 మంది పది టాప్ విద్యార్థి విద్యార్థులు

– విద్యార్థులకు కలెక్టర్ ప్రోత్సాహక యాత్ర – కృతజ్ఞతలు తెలిపిన తల్లి తండ్రులు





**మెదక్ (ప్రజాజ్యోతి ) మే 19 :** పదవ తరగతి ఫలితాలలో 560 మార్కులు మరియు అంత కంటే ఎక్కువ వచ్చిన ప్రభుత్వ పాఠశాలల 70 మంది విద్యార్థులను మంగళవారం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో హైదరాబాద్ కు ( రామోజీ ఫిల్మ్ సిటీ ) కి విహారయాత్ర కు తీసుకువెళ్లారులి. మెదక్ జిల్లాలో మార్చి 2026 పదవ తరగతి ఫలితాలలో 560 మరియు ఆపై మార్కులు వచ్చిన 70 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అభినందిస్తూ రామోజీ ఫిలిం సిటీ సందర్షణకు ఒక రోజు విహార యాత్ర కు మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి బయలుదేరారు. ఈ విద్యార్థులందరూ ఉదయం ఏడు గంటలకు మెదక్ కలెక్టరేట్ నుండి బయలుదేరి రామోజీ ఫిల్మ్ సిటీ సందర్శన కు బయలుదేరి వెళ్లారు, ఈ విహార యాత్రలోజిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సాధు, సుదర్శన్ మూర్తి, ఏపీవో రమేష్, కేజీబీవి ఎస్ ఓ బాలలక్ష్మి , శ్రీకాంత్ లు అలాగే విద్యాశాఖ సిబ్బంది ఎస్కార్ట్ గా వెళ్లారు . ఇటువంటి నిర్ణయం తీసుకుని విద్యార్థులను ప్రోత్సహించినందుకు జిల్లా కలెక్టర్ కి విద్యార్థుల తల్లిదండ్రులు , వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యా యులు మరియు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ధన్యవాదాలు తెలిపారు.

# పెద్దమ్మ దేవి వార్షికోత్సవానికి ఆహ్వానం

– పద్మ దేవేందర్ రెడ్డికి పత్రిక అందజేసిన రాజీపేట ముదిరాజులు



**మెదక్( ప్రజాజ్యోతి ) మే 19 :** హవెలిఘనపూర్ మండలంలోని రాజపేట్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్న శ్రీశ్రీ పెద్దమ్మ దేవి పంచమ వార్షికోత్సవాల సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మదేవేందర్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో వారి నివాసంలో రాజపేట్ బిఆర్ఎస్ నాయకులు సాయగౌడ్, ఏసు,ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ దేవి పంచమ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు చింతకుంట సాయిలు, బోళ్ళ కిషన్, కలకుంట్ల అశోక్, చెవ్వనల్ల పోచయ్య, బొల్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## లారీల కోసం అదనపు కలెక్టర్‌ను
# కలిసిన పోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి

– సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్



**కొల్చారం (ప్రజాజ్యోతి ) మే 19 :** లారీలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ను మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పైతర సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి రైతులతో కలిసి మంగళవారం సమస్యను పరిశరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అరుగాలం కష్ట పడి పండించిన ధాన్యం తూకం వేయక పోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైతర గ్రామంలో వరి ధాన్యం కుప్పలు ఎక్కడికక్కడే పేరుకుపో యినవి లారీలు రాక తూకం వేయక రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు . వారం రోజుల్లో రోహిణి కార్తీ వర్షాలు మొదలయ్యే అవకాశం ఉన్నందున ఇంకా 50 లారీలు ఇంచుమించు 30 వేల బస్తాలకు సరిపడా ధాన్యం ఇంకా కల్లాల వద్ద ఉన్నాయన్నారు . ప్రస్తుతం 2230 బస్తాల ధాన్యం సంచుల్లో నింపి ఉన్న లారీలు రాక కల్లాల వద్ద ఉన్నాయి కనుక ఈ విషయంపై రైతులు పడుతున్న బాధలపై అదనపు కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చారు. వెంటనే లారీలు పంపించాలని కోరారు . దీనిపై సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ రవితేజ రెడ్డి వెంట రైతులు ఉన్నారు.

## ఆన్‌లైన్ మందుల విక్రయాలపై
# "నేడు" దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్

– భారీ డిస్కౌంట్లతో చిన్న వ్యాపారాలపై దెబ్బ.. దేశవ్యాప్తంగా నిరసనలు
– ఈ-ఫార్మసీలపై యుద్ధానికి దిగిన కెమిస్టులు, డ్రగ్గిస్టులు






**తూప్రాన్ (ప్రజాజ్యోతి) మే 19:** ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కెమిస్టులు, డ్రగ్గిస్టులు ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో మే 20న మెడికల్ షాపులు బంద్ నిర్వహించనున్నట్లు తూప్రాన్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ర్యాకల కృష్ణ గౌడ్ తెలిపారు. తూప్రాన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆన్‌లైన్ ఫార్మసీల పెరుగుదలతో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ డిస్కౌంట్ల పేరుతో బహుళ జాతి కంపెనీలు చిన్న వ్యాపారులను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. వ్యాపారుల ప్రధాన ఆందోళనలు: ప్రిస్క్రిప్షన్ ధృవీకరణ లేకుండానే మందుల విక్రయం. నకిలీ మరియు నాణ్యత లేని మందుల సరఫరా ప్రమాదం. యువత మత్తు మాత్రలకు బానిసయ్యే అవకాశం. గ్రామీణ ప్రజలకు స్థానిక కెమిస్టుల సేవలు దూరమయ్యే పరిస్థితి. దేశవ్యాప్తంగా లక్షలాది చిన్న మెడికల్ షాపుల మనుగడ ప్రశ్నార్థకం కావడం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ-ఫార్మసీలపై కట్టుదిట్టమైన నియంత్రణలు తీసుకురావాలని, వైద్యం లాభాపేక్ష కంటే సేవగా కొనసాగాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# హమాలి కార్మికులకు సల్ల ప్యాకెట్ల పంపిణీ

**నంగునూర్ మే 19(ప్రజా జ్యోతి):-** మండల పరిధిలోని సిద్దన్నపేట మార్కెట్ యార్డులో పనిచేస్తున్న ఆమాలి కార్మికులకు మంగళవారం నాడు ఏఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి హమాలీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్ల ను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ లో కొనుగోలు పూర్తయ్యేంతవరకు ప్రతిరోజు సల్ల ప్యాకెట్లను అందిస్తానన్నారు ఎండలు అధికంగా ఉండడం వల్ల కార్మికులకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు అలాగే ప్రతిరోజు హమాలీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు అమాలి కార్మికులు మార్కెట్ డైరెక్టర్లు రమేష్ శ్రీకాంత్ రాజశేఖర్ రెడ్డి మార్కెట్ కమిటీ సిబ్బంది ఆశయ రాజిరెడ్డి పిఎసిఎస్ సిబ్బంది రాజేందర్ బాలయ్య బాలయ్య లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# వారసత్వ సంపద కాపాడడం ప్రతి ఒక్కరి భాద్యత

– ఘనమైన చరిత్ర కల్గిన మెదక్ జిల్లాను టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దాలి – జిల్లా అదనపు కలెక్టర్ నగేష్









**మెదక్ (ప్రజాజ్యోతి ) మే 19 :** చారిత్రక -- సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగామెదక్ జిల్లాకు వేల ఏళ్ల చరిత్ర, అపారమైన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచారాలు గొప్ప గుర్తింపు ఉందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను, వారసత్వ సంపదను కాపాడుకోవాలనీ సిఎస్ ఐ పాఠశాలలోని ఆడిటోరియంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడు తూ...పూర్వీకులు నిర్మించిన దేవాలయాలు, కోటలు,మసీదులు, పురాతన కట్టడాలు, జానపద కళలు, భాషలు, సాహిత్యం, సంప్రదాయ పండుగలు మన చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చరిత్ర అనేది కేవలం గతాన్ని గుర్తుచేసేది మాత్రమే కాదు, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కూడా. మన పూర్వీకుల త్యాగాలు, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, కళా వైభవం సమాజ అభివృద్ధికి పునాది వంటివని తెలిపారు. మన సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు ఉండటానికి మన పురాతన సంపద, వైవిధ్యభరితమైన సంప్రదాయాలే కారణమని వివరించారు. మునిపల్ చైర్పర్సన్ కనుగుల రాధిక భూపతి రాజ్ మాట్లాడుతూ.. యువత తమ సంస్కృతి, చరిత్ర పట్ల అవగాహన పెంచుకొని వాటి పరిరక్షణలో ముందుండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో చారిత్రక వారసత్వంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మాట్లాడుతూ...పురాతన దేవాలయాలు, శిల్పాలు, చారిత్రక కట్టడాలను రక్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పర్యాటక అభివృద్ధితో పాటు చారిత్రక ప్రాంతాల పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రక సంపదను కాపాడితేనే భవిష్యత్ తరాలకు మన గొప్ప సంస్కృతి అందుతుందని తెలిపారు. మన సంస్కృతి మన ఆత్మగౌరవానికి ప్రతీక అని, భాష, సాహిత్యం, కళలు, సంప్రదాయాలు నిలిచి ఉంటేనే సమాజం బలంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక చరిత్ర, పురాతన సంపద, కళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు, కవులు, రచయితలు, ఉపాధ్యాయులు,పౌరులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల ప్రణాళిక.. విద్యార్థుల అంకితభావం

– జెర్రిపోతుల తండా విద్యార్థులకు నవోదయ గురుకుల సీట్లు













**నంగునూరు, మే 19(ప్రజా జ్యోతి):-** ప్రభుత్వ బడిపై నమ్మకాన్ని పెంచుతూ, ఉపా ధ్యాయుల అంకితభావం తండా బడిని విజయాల నంద నవనంగా మార్చింది. ఒకప్పుడు మండలంలో జేపీ తండా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఒక మారుమూల తండా. బద్దిపడగ గ్రామ పంచాయతీకి మధిర. తండా వాసులకు అక్షర జ్ఞానం కల్పించేందుకు 1993లో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారు. 1997లో జిల్లా ప్రాథమిక విద్యా పథకం కింద రెండు గదులను నిర్మించారు. సుమారు 500 మంది జనాభా, 380 మంది ఓటర్లు ఉండడంతో ఈ తండాలు 2018లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. అనంతరం 'మన ఊరు మన బడి' పథకం కింద ఇక్కడ నూతన పాఠశాల భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 43 మంది విద్యార్థులు చదువుతుండగా... ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక వాలంటీర్ విద్యా బోధన అందిస్తున్నారు. విద్యార్థులకు ప్రాథమిక దశలోనే గట్టి పునాది వేయాలనే సంకల్పంతో 2016లో అప్పటి ప్రధానోపాధ్యాయుడు సంగు రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నవోదయ ఎంపిక కోసం శిక్షణను ప్రారంభించారు. ఆ తరువాత ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.చంద్రం ఆధ్వర్యంలో నవోదయతో పాటు,గురుకుల ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు ప్రతిష్టాత్మక నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషిని గుర్తించిన దాతలు పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో దాతల సహకారంతో వివిధ సౌకర్యాలు కల్పించారు. భుక్యా లక్ష్మణ్ నాయక్ మైక్ సెట్ అందించారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు శోభారాణి టీవీ, రెండు కంప్యూటర్లు సమకూర్చారు. తండాలో ముదిరాజ్ యువజన సంఘం డ్రమ్స్, నాయక్ యువజన సంఘం మంచి నీటి శుద్ధి యంత్రం, గుగులోతు సరిత విద్యుత్ గంట, వంగ రాజేశ్వర్ రెడ్డి విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ పాఠశాలలో గతంలో 30 మంది విద్యార్థులు ఉండే వారు. ఆవాస ప్రాంతంలో ఉన్న విద్యార్థులంతా తమ పాఠశాలలో చేరితే నాణ్యమైన విద్యను అందిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శోభారాణి, సంతోషి తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించారు. అందుకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రం, ఉపాధ్యాయురాలు శోభారాణిల నిరంతర పర్యవేక్షణ, నాణ్యమైన బోధన తండా వాసుల్లో సరికొత్త నమ్మకాన్ని నింపాయి. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ బడిలోనే మెరుగైన విద్య అందుతుందనే నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడే చేర్పించారు. ఫలితంగా ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య ఏకంగా 45 కు చేరింది. వీరిలో ఇద్దరు గురుకుల పాఠశాలలో సీట్లు పొందడంతో 43 మంది విద్యార్థులకు బోధన అందించారు. ఐదో తరగతిలో ఎనిమిది మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

**నవోదయ, గురుకులాల్లో వంద శాతం సీట్లు**

తల్లిదండ్రులకు ఇచ్చిన హామీ మేరకు ప్రధానోపాధ్యాయుడు ఎన్.చంద్రం, ఉపాధ్యాయులు సీహెచ్.శోభారాణి, ఎం.సంతోషిలు పాఠ్యాంశాల బోధనతో పాటు, ఐదో తరగతి విద్యార్థులను పోటీ పరీక్షలకు ప్రత్యేక ప్రణాళికతో సన్నద్ధం చేశారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షతో పాటు, గురుకుల నిత్యం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో పట్టుదలను పెంచారు. వారి కష్టానికి తగ్గట్లే ఫలితాలు అద్భుతంగా వచ్చాయి. ఈ పాఠశాల నుంచి ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో యామ వైష్ణవి, పిట్టల భార్గవి ప్రతిష్టాత్మకమైన జవహర్ నవోదయ విద్యాలయంలో గ్రామీణ ప్రాంత జనరల్ కోటలో అరవ తరగతి సీట్లు సాధించి పాఠశాల కీర్తిని చాటారు. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభతో యామ వైష్ణవి మొదటి జాబితాలో, పిట్టల భార్గవి రెండవ జాబితాలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ సంవత్సరం సీట్లు సాధించారు. మిగిలిన విద్యార్థులందరూ రాష్ట్ర గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో చాటిన ప్రతిభతో సీట్లు సాధించి వంద శాతం ఫలితాలతో రికార్డు సృష్టించారు. పొన్నాల, సిద్దిపేట, కొండపాక గురుకుల పాఠశాలలకు ఆరుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. మారుమూల తండాలో ఉంటూ.. ఒకే బ్యాచ్‌లోని విద్యార్థులందరూ ఉన్నత పాఠశాలలకు ఎంపికవ్వడంపై స్థానికులు, విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కఠోర శ్రమే ఈ విజయానికి కారణమని ప్రశంసిస్తున్నారు.

**నాణ్యమైన విద్య అందింది...ఆర్థిక భారం తగ్గింది**
**– యామ విజయ, విద్యార్థి తల్లి**

మాలాంటి పేద కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి వసతులతో కూడిన ఉచిత రెసిడెన్షియల్ విద్య దక్కడం మా అదృష్టం. నాణ్యమైన విద్యాసంస్థల్లో సీట్లు రావడం ద్వారా మా పిల్లల ఉన్నత చదువులకు, ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది పడింది. మా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, రాత్రింబవళ్లు కష్టపడి ఉచితంగా కోచింగ్ ఇచ్చిన చంద్రం సార్, శోభారాణి మేడం, సంతోషి మేడంకు రుణపడి ఉంటాము. ఒకేసారి తండాలోని పిల్లలందరికీ ప్రతిష్టాత్మక పాఠశాలల్లో సీట్లు రావడంతో మా ఊరి పేరు నిలబడింది.

**మా పిల్లల భవిష్యత్తు మారింది**
**– భుక్యా లక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్**

"గతంలో మారుమూల తండా బడి అంటే అంతగా పట్టించుకునేవారు కాదు. కానీ చంద్రం సార్, శోభారాణి మేడం, సంతోషి మేడం వచ్చిన తర్వాత బడి రూపు రేఖలు మారాయి. ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లకుండా మా పిల్లలకు ఇక్కడే నవోదయ, గురుకులాల్లో సీట్లు వచ్చేలా రాత్రింబవళ్లు కష్టపడి చదివించారు. మా తండా పిల్లల భవిష్యత్తు మార్చిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటాం.

**సమిష్టి కృషి ఫలితం.. ఈ విజయం**
**– శోభారాణి, ఉపాధ్యాయురాలు**

విద్యార్థుల క్రమశిక్షణ, తల్లిదండ్రుల మద్దతుతో ప్రధానోపాధ్యాయుడు చంద్రం ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయురాలు సంతోషితో కలిసి ప్రత్యేక ప్రణాళికతో అందించిన శిక్షణ వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైంది. ఒకే తండా పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు ప్రతిష్టాత్మక జవహర్ నవోదయ విద్యాలయానికి, మిగిలిన వారంతా ప్రభుత్వ గురుకులాలకు ఎంపికవ్వడం మాకెంతో గర్వకారణం.

**ప్రత్యేక ప్రణాళికతోనే విజయం**
**– చంద్రం, ప్రధానోపాధ్యాయుడు**

"మా పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచడం ఎంతో గర్వంగా ఉంది. ఉపాధ్యాయురాళ్ళు శోభారాణి, సంతోషితో కలిసి విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. నిత్యం అదనపు సమయం కేటాయించి, ఒత్తిడి లేకుండా బోధించాం. మా నమ్మకాన్ని నిలబెడుతూ వంద శాతం సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందనలు. తండా తల్లిదండ్రుల నమ్మకమే మాకు బలం. నాణ్యమైన బోధన అందిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దేనిలోనూ తక్కువ కాదని మా పిల్లలు నిరూపించారు. ఈ విజయం తండాలోని మిగతా విద్యార్థుల్లో మరియు తల్లిదండ్రుల్లో మరింత ఉత్సాహాన్ని, నమ్మకాన్ని నింపుతుంది."

**ఇతర పాఠశాలలకు ఆదర్శం**
**– పురుమాండ్ల శ్రీనివాస రెడ్డి, నంగునూరు మండల విద్యాధికారి**

"జెర్రిపోతుల తండా పాఠశాల ఉపాధ్యాయులు సాధించిన ఫలితాలు అభినందనీయం. మారుమూల ప్రాంతంలో ఉంటూ విద్యార్థులను నవోదయ, గురుకులాలకు వంద శాతం ఎంపికయ్యేలా తీర్చిదిద్దడం వారి అంకితభావానికి నిదర్శనం. మండలంలోని మిగతా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలి."

**ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటారు**
**– ఎల్లంకి శ్రీనివాస రెడ్డి, జిల్లా విద్యాధికారి**

"సదుపాయాల కంటే సంకల్పం గొప్పదని జెర్రిపోతుల తండా పాఠశాల నిరూపించింది. యామ వైష్ణవి, పిట్టల భార్గవి నవోదయకు ఎంపికవ్వడం, మిగిలిన విద్యార్థులంతా గురుకుల సీట్లు సాధించడం జిల్లాకే గర్వకారణం. ఉపాధ్యాయులు చంద్రం, శోభారాణిలకు ప్రత్యేక అభినందనలు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పడానికి ఈ విజయమే నిదర్శనం.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తా అన్న ప్రభుత్వంలో కూటికి సరిపడని వీఓఏ ల వేత్తనం

**– వీఓఏ,లకు కనీస వేత్తనం 20,000 లకు పెంచాలి**
**– వీఓఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి**



– వీఓఏ హక్కులను కలరస్తున్న జీవో నెంబర్ 58 నీ వెంటనే రద్దు చేయాలి

**దౌల్తాబాద్ మే, 19(ప్రజాజ్యోతి) :** ఐకేపీ వీఓఏ ల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు దౌల్తాబాద్ మండల కేద్రంలోని మండల మహిళా సమాఖ్య ముందు కొనసాగుతున్న వీఓఏ ల నిరవధిక సమ్మె....ఈ సందర్భంగా వీఓఏ లు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాడ్ లను పరిష్కరించాలని ప్రభుత్వనీ డిమాండ్ చేశారు. అదేవిదంగా రాష్టం లోనే అతి తక్కువ వేతనం పొందుతున ఉద్యోగాలలో ఒకరు వీఓఏ లు.అలాగే రాష్ట్రము లో అన్ని రకాల వివిధ శాఖలలో అనేక పనిచేస్తున్న ఉద్యోగులో కూడా వీఓఏ లు ఉన్నారు.అందుకనే ప్రభుత్వం వెంటనే మాకు వేతనం 20,000 వేలు పెంపు , ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం, పని భారం, తాగింపు, సీనియర్ ఉన్న ఒఖ్య లకు సీసీ లుగా పాదోనతి కల్పించాలి. అదేవిదంగా జిఓ నెంబర్ 58 నీ వెంటనే రద్దు చేయాలి హెచ్ఆర్ పాలసీ అమలు చేసి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలనారు. ఈ కార్యక్రమం లో మండల అన్ని గ్రామాల వీఓఏ లు పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో... ఘనంగా కొమ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి



**పరిగి, మే 19 (ప్రజాజ్యోతి) :** భారత కమ్యూనిస్టు ఉద్యమ మహానేత, రైతాంగ– –కార్మిక వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కొమ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పరిగి పట్టణంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య మాట్లాడుతూ... కొమ్రేడ్ సుందరయ్య దేశ రాజకీయాల్లో నిస్వార్థ నాయకుడిగా, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన మహానేతగా నిలిచారని తెలిపారు. పేదలు, రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల అభ్యున్నతికోసం ఆయన చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయడం, సామాజిక సమానత్వం కోసం కట్టుబడి పనిచేయడం సుందరయ్య జీవితం మనకు మార్గదర్శకమని అన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతు సమస్యలు, కార్మికుల ఇబ్బందులపై ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సుందరయ్య ఆశయ సాధనే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు,ఎండీ హబీబ్, సత్తయ్య, లాలయ్య, విజయ్, మహబూబ్, ఆసిద్, బసప్ప, రమేష్ ,నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ ఎం.రమేష్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ముద్దం నరసింహ యాదవ్



**బోయిన్ పల్లి, మే19.(ప్రజా జ్యోతి) :** ఓల్డ్ బోయిన్ పల్లి 119 డివిజన్ పరిధిలోని వల్లభ్ నగర్ కాలనీ వాసులు సీనియర్ జర్నలిస్ట్ ఎం. రమేష్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓల్డ్ బోయిన్ పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ శాలువాతో సన్మానించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముద్దం మల్లికార్జున యాదవ్, బుర్రి యాదగిరి, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొని ఎం. రమేష్‌కు శు భాకాంక్షలు తెలియజేశారు.

## భీమగౌని భాస్కర్ గౌడ్‌ను అభినందించిన గ్యారాల శ్రీనివాస్ గౌడ్



**అబ్దుల్లాపూర్ మెట్టు మే 19 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ పార్టీ కుంట్లూరు 51 వ డివిజన్ అధ్యక్షుడిగా నూతనంగా నియమించబడిన కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన భీమగౌని భాస్కర్ గౌడ్ ను మంగళవారం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ తాజా మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్యారాల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టపడి పని చేసే వారిని తప్పక గుర్తిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తూ కుంట్లూరు 51వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన భీమగౌని భాస్కర్ గౌడ్ కుంట్లూరు డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ,రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

## భానుడి భగభగ.. పరిగిలో పెరుగున్న ఉష్ణోగ్రతలు..!

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచనలు**






**పరిగి, మే 19 (ప్రజాజ్యోతి) :** పరిగి పట్టణంలో మే నెల ప్రారంభం నుండి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతు వుండటంతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ప్రస్తుతం పరిగి పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సుమారు 37 డిగ్రీ సెంటిగ్రేడ్ నుండి 39 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉన్నట్లు తెలుస్తుంది. రాబోయే నాలుగు రోజుల్లో కూడా గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు 40 డిగ్రీ సెంటిగ్రేడ్ ల వరకు ఉండే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రత 26 నుండి 27 డిగ్రీ సెంటిగ్రేడ్‌ల వరకు పడిపో తుంది. మండుతున్న ఎండల కారణంగా ప్రజలుజ బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్లే వారు తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం, నీటి సీసాలు వెంట తీసుకెళ్లడం, డీహైడ్రేషన్ నుండి ఉపశమనం కొరకు ఎలక్ట్రాల్ అలాగే పండ్ల రసాలు తీసుకోవడం మంచిదని సూచించారు. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు. చిన్నారులు ఎండలో ఎక్కువసేపు ఆడకుండా నీడ ప్రాంతాల్లో లేదా ఇంటి ఆవరణలో ఇండోర్ గేమ్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. అలాగే సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి శారీరక శ్రమ ఎక్కువగా ఉండే కార్యక్రమాలను కొంతవరకు తగ్గించాలని తెలిపారు. భానుడి భగభగలతో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలని వైద్యులు సూచించారు.

## మహా న్యూస్ ఛానల్‌పై చర్యలు తీసుకోవాలి..






**– పరిగి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**

**పరిగి, మే 19 (ప్రజాజ్యోతి) :** బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై మహా న్యూస్ ఛానల్‌లో వంశీకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంచన్‌పల్లి ఆనంద్ ఆధ్వర్యంలో పరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతిగారి సురేందర్ మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా మహా న్యూస్ తెలుగు ఛానల్ డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులపై అవమానకరమైన ట్రోలింగ్స్, తప్పుడు వార్తలు ప్రసారాలు చేస్తోందని ఆరోపించారు. ఈ చర్యలు వ్యక్తిగత పరువుకు భంగం కలిగించడమే కాకుండా కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని అన్నారు. షెడ్యూల్ కులానికి చెందిన నాయకుడిని లక్ష్యంగా చేసుకుని పరువు తీసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ ప్రసారాల వెనుక వంశీకృష్ణ అనే వ్యక్తి ఉన్నట్లు సమాచారం ఉందని, ఆయనపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఐటి యాక్ట్--2000 తోపాటు తగిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా మహా న్యూస్ ఛానల్ యాజమాన్యం మరియు మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణపై వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టి20 న్యూస్ సిఇఒ మహ్మద్ రఫిక్, బహుజన నాయకులు మక్తల్ సింగం, కుదన్‌పూర్ బీఆర్ఎస్ సర్పంచ్ యాదయ్య, రావులపల్లి ఉప సర్పంచ్ బాలు, రూపీఖాన్‌పేట్ వార్డు సభ్యుడు ఆంజనేయులు, మేడికొండ వార్డు సభ్యుడు నగేష్, చిట్యాల బీఆర్ఎస్ నాయకులు గడ్డమీది రాజు, చిలపూర్, మహేష్, ఆర్ఎస్పి సైన్యం నాయకులు రాయికంటి పవన్‌కుమార్, చిట్యాంపల్లి శ్రీకాంత్, రామకృష్ణ, రూప్‌సింగ్ తండా వెంకట్, చిగురాలపల్లి అనంతయ్య, రంగాపూర్ మహ్మద్ వాలి, మహ్మద్ వాషిమ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

**– రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ – శంషాబాద్ మండలంలోని 9 మందికి సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, మే 19 (ప్రజా జ్యోతి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన రంగారెడ్డి జిల్లా రాజేం ద్రనగర్ నియోజకవర్గం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామానికి చెందిన రఘుపతి రెడ్డికి 60 వేలు,కవ్వగూడ ఆదిత్తాకు 47 వేలు,పెద్దషాపూర్ వడ్డేమోని రాజుకు 19 వేలు, పాలమాకుల సమీన్ బేగంకు 34 వేలు, అల్లీకోల్ తాండ సంగీతకు 31 వేలు, హమీదుల్లా నగర్ గణేష్ యాదవ్ కు 69 వేలు,పిల్లోనిగూడ సిద్దయ్యకు 32 వేలు,కాచారం గ్రామానికి చెందిన చాకలి మంజులకు 15 వేలు,సునీతకు 18 వేలు,మొత్తం 9 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 3 లక్షల రూపాయల చెక్కును ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉండేది కానీ అది ఏ ఒక్కరికి సరిగా అందేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఒక్కరికి చేయూతనిచ్చే విధంగా ఆపదలో ఉన్న వారికి ఆదుకోవాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి గ్రామాలలో పేదవారికి కూడా అందజేయడం జరుగుతుందన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి లబ్ధిదారునికి అందే విధంగా కృషి చేస్తున్నారన్నారు. ఇంకా ఎవరికైనా రాకుంటే విడతల వారీగా లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ పల్లి సర్పంచ్ ఎలుగని ప్రభాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్ గౌడ్, నాయకులు ముదిరాజ్, మహేందర్ ముదిరాజ్, దండు ఇస్త్రారి, రమేష్ యాదవ్, జగన్ గౌడ్, సతీష్ యాదవ్, బిక్షపతి, నర్సింహా, శివకుమార్ గౌడ్, మహేష్, రాజు గౌడ్, జుర్కి రమేష్, శ్రీశైలం, బాలు, తదితరులు పాల్గొన్నారు.

## 40 ఏళ్ల పెల్టోఫోరం చెట్టు విజయవంతంగా తరలింపు









**– ట్రాఫిక్ సౌలభ్యానికి చెట్టు మార్పిడి చర్యలు**
**– పర్యావరణ పరిరక్షణతో ట్రాఫిక్ అభివృద్ధి: ఎసిపి శంకర్ రాజ్**

**బోయిన్ పల్లి, మే19.(ప్రజా జ్యోతి) :** నగరంలో ట్రాఫిక్ నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ బేగంపేట్ ట్రాఫిక్ పోలీసులు మరో వినూత్న చర్య చేపట్టారు.బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్యాంలాల్ జంక్షన్ సమీపంలో వాహనాల రాకపోకలకు ఆటం కంగా ఉన్న సుమారు 40 సంవత్సరాల వయస్సు గల భారీ పెల్టోఫోరం చెట్టును విజయవంతంగా తరలించారు. జంక్షన్ అభివృద్ధి, ట్రాఫిక్ నియం త్రణ చర్యలలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం రాహుల్ రెడ్డి డీసీపీ ట్రాఫిక్–1, అదనపు డీసీపీ షకీర్ హుస్సేన్ పర్యవేక్షణలో నిర్వహించ బడింది. బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.జనకి రాములు, ఆర్ఎస్ఐ అశోక్ రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది సమన్వయంతో అటవీ శాఖ, జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం, స్థానిక నాయకుడు హోసే–టోకుచర్ సహకారంతో ఈ ప్రత్యేక చర్య చేపట్టారు. సంబంధిత శాఖల అనుమతులతో చెట్టును శాస్త్రీయ పద్ధతిలో కొమ్మలను కత్తిరించి, జాగ్రత్తగా బేగంపేట్ సమాధి వాటిక ప్రాంగణానికి తరలించారు.చెట్టు తరలింపుతో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణికుల భద్రత మెరుగుపడిందని అధికారులు తెలిపారు.అదేవిధంగా నగర హరిత వాతావరణాన్ని కాపాడే దిశగా ఈ చర్య ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరలించిన చెట్టు ఆరోగ్యవంతంగా పెరిగేలా నిరంతర పర్యవేక్షణ, సంరక్షణ చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే బండారి ప్రత్యేక చొరవ





**ఉప్పల్, మే 19, ప్రజాజ్యోతి :** ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా మురుగునీటి వ్యవస్థల దుస్థితిపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (జలమండలి) మేనేజింగ్ డైరెక్టర్ పంకజ ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బగాయత్ లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదన లను వెంటనే ఆమోదించి, ప్రాధాన్యత ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా సక్రమమైన మురుగు నీటి పారుదల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్-2026 హెల్ప్‌డెస్క్ ఏర్పాటు




**పరిగి, మే 19 (ప్రజాజ్యోతి):** జిల్లా ఎన్నికల అధికారి ఒ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమానికి సంబంధించి పరిగి తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు ప్రతి హెల్ప్‌డెస్క్ వద్ద కంప్యూటర్ కౌంటర్‌తో ఒక ఆపరేటర్‌ను శాశ్వతంగా నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితా సవరణలు, నమోదు, వివరాల మార్పులు తదితర సేవలను ప్రజలు సులభంగా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ నాయబ్ తహశీల్దార్ అనిల్‌బాబు, నాయబ్ తహశీల్దార్ విజయేందర్, ఆర్ఐ దివ్య, ఎలక్షన్ ఆపరేటర్ శ్రీ వాణి తోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిగి 12, 13 వార్డుల్లో నేడు ఎస్ఐఆర్ కార్యక్రమం



**పరిగి, మే 19 (ప్రజా జ్యోతి):** పరిగి పట్టణం లోని 12వ వార్డు అలాగే 13వ వార్డు ప్రజలకు ప్రత్యేక ఓటరు సర్వే (ఎస్ఐఆర్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పురపాలక సంఘం కమిషన్ వెంకటయ్య తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు మేదరి శ్రీను ఇంటి వద్ద బీఎల్వోలు, జీపీవోలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. వార్డుల పరిధిలోని ప్రజలు తమ పాత అలాగే కొత్త ఓటర్ ఐడీ కార్డులను వెంట తీసుకువచ్చి ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఓటరు వివరాల సరిచూడడం, నవీకరణ కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తప్పకుండా హాజరై సహకరించాలని పరిగి పురపాలక సంఘం కమిషన్ తోపాటు 13వ వార్డు కౌన్సిలర్ మీర్ సమీనా తాహెర్ అలీ విజ్ఞప్తి చేశారు.

## మండుటెండల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**ప్రజలకు పలు సూచనలు అందించిన తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**అబ్దుల్లాపూర్ మెట్టు మే 19 (ప్రజాజ్యోతి) :** ఉష్ణోగ్రతలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతుండడంతో ప్రజలందరూ మండుటెండలపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ హయత్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని దీంతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని,అలాంటి సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం అన్నారు.ఎండ వేడిమితో శరీరంలోని నీరు చెమట రూపంలో బయటకు వెళ్ళిపోతుందని అందుకే మంచినీరు కొబ్బరినీళ్లు మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను తరచుగా తీసుకోవాలన్నారు. వృద్ధులు చిన్నారులు ఈ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకి వెళ్లకూడదని అన్నారు. అత్యవసరమైన పనులు ఉంటే ఉదయం సాయంత్రం వేళల్లో పనులు ముగించుకొని ఇంటి వద్దనే ఉండాలన్నారు. వేసవికాలంలో మన జాగ్రత్తే మనకు శ్రీరామరక్ష అన్నారు.

## హిందూ బంధువులారా కదలిరండి.. ఐక్యత చాటండి

**– కొత్తూరు మారుతి ఆలయంలో హిందూ సమ్మేళనం సన్నాహక సమావేశం..**
**– మే 25న కొత్తూరు బండారి గ్రౌండ్ లో మెగా హిందూ సమ్మేళన సభకు శ్రీకారం..**
**– హాజరు కానున్న త్రిదండి అహోబిల రామానుజ జీయరు స్వామి..**



**కొత్తూర్ మే 19 (ప్రజా జ్యోతి) :** గడప లోపలే కులం.. గడప దాటితే హిందువులం.. అనే నినాదంతో వాడవాడల కొనసాగుతున్న హిందూ సమ్మేళనాన్ని కొత్తూరు పట్టణ కేంద్రంలో నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక మారుతి ఆలయంలో సన్నాహక సమావేశం చేపట్టారు. కొత్తూరు ఉప మండలం పరిధిలోని కొత్తూరు, కొత్తూరు తండా, తిమ్మాపూర్, కుమ్మరిగూడ, అక్కివేనిగూడ, తాళ్లగూడ, మల్లాపూర్, మల్లాపూర్ తండా, రంగాపూర్, ఇన్ముల్ నర్వ, పరిధిలోని హిందూ బంధువులందరూ సమ్మేళనానికి సంసిద్ధం కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. సమ్మేళనం కొత్తూరు కమిటీ అధ్యక్షుడిగా విష్ణు చారిని నియమించారు. అనంతరం దాతల నుండి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా సమ్మేళనానికి హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జే.సుదర్శన్ గౌడ్, దేవేందర్ యాదవ్, నరసింహా గౌడ్, నాగరాజు చారి, అముడాపురం నరసింహ గౌడ్, జనార్దన్ చారి, గోవింద్ రెడ్డి, మల్లేష్ ముదిరాజ్, ఇందూరి శ్రీనివాస్, వీరమోని శ్రీను, ప్రభాకర్ రెడ్డి, చిలకమర్రి నరసింహ, రణధీర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, అరవింద్, క్యాస బాలకృష్ణ, బావుగారి అంజయ్య, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# ఈతవనం దగ్ధం

మెట్ పల్లి, మే 19, ప్రజా జ్యోతి:
మండలం వెంపేట గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 450 ఈత చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనతో గీతా వృత్తిపై ఆధారపడిన దాదాపు వంద కుటుంబాలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రైతులు పొలాల్లో మిగులు వ్యర్థాలకు నిప్పు పెట్టే ముందు గీతా కార్మికులకు సమాచారం అందిస్తే చెట్లను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సందీప్ రావు ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, గీతా కార్మికులు పాల్గొన్నారు.



## నేటి యువత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య

ఇల్లంతకుంట మే 19(ప్రజజ్యోతి)
కమ్యూనిస్టు యోధుడు, పేద కార్మిక కర్షక మహానేత పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్ద లింగపూర్ గ్రామంలో ఉపాధి కూలీల ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులు. అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణ భారత



కమ్యూనిస్టు నిర్మాత బడుగు బలహీన వర్గాల పక్షపాతి అభ్యుదయ వాది అయినా పుచ్చలపల్లి సుందరయ్య పోరాటం ఈ దేశానికి బడుగు బలహీన వర్గాలకు ఎంతో ఉపయోగపడిందని పేద వర్గాలకు సేవ చేయడం కోసం రెడ్డి అనే పదము అడ్డు వస్తుందని తన పేరును పుచ్చలపల్లి సుందరరంరెడ్డికి బదులుగా పుచ్చలపల్లి సుందరయ్యగా పేరు మార్చుకొని పేద వర్గాల కోసం జీవించాడని అన్నారు పిల్లలు పుడితే తాము ఉద్యమానికి న్యాయం చేయలేమని తమకు సంతానమే వద్దు అనుకున్న మహానేత అని కొనియాడారు నేడు ఈ దేశానికి సుందరయ్య లాంటి నాయకులు కావాలని ఆయన ఆదర్శాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆయన కలలు కన్నా రాజ్యం కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు రాజిరెడ్డి తిరుపతి భారతి మల్లారెడ్డి మల్లయ్య లక్ష్మీ రాజు శ్రీనివాస్ లక్ష్మి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ దీకొండ బాబ లక్ష్మి - మధు

### అంగన్వాడీ రికార్డులను తనిఖీ చేసిన సర్పంచ్.

గంగాధర మే 19: (ప్రజా జ్యోతి)
మండలంలోని నారాయణపూర్ గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌ను సర్పంచ్ దీకొండ బాబ లక్ష్మీ – మధు మంగళవారం సందర్శించారు. ఈ





సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని గర్భిణులకు పాలు మరియు గుడ్లను పంపిణీ చేశారు. అంగన్వాడి పిల్లలకు సరైన పోషకాహారం అందజేయాలని సర్పంచ్ అంగన్వాడి సిబ్బందికి సూచించారు.

## వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్అ ధ్యక్షుడుకుసన్మానం

వేములవాడ,మే,19:ప్రజాజ్యోతి
వేములవాడ రూరల్ కాంగ్రెస్ పా ర్టీ అధ్యక్షులుగా ఎన్నికైన సోయి నేని కర్ణాకర్ కు రూరల్ కాంగ్రెస్ నాయకులు ఘనముగాసన్మానం చేశారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంఘ స్వామి యాదవ్ మాట్లా డుచూ సీనియర్ కాంగ్రెస్ నాయ కుడైన కర్ణాకర్ సమర్థుడని అత నికి పదవి



ఇచ్చినందుకు వేము లవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు ఎదురుగట్ల గ్రామ సర్పంచిగా మంచిగా పనిచేసి మంచి పేరు సంపాదించిగ్రామాన్నిఅన్నివిధాలా అభివృద్ధి చేసి ఆదర్శం గా నిలిచాడు అన్నారు
ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సినీ యరు కాంగ్రెస్ నాయకులు బండ శ్రీనివాస్ యాదవ్ వంగపల్లి మల్లే శంఅడికాజయపాలరెడ్డివెలిచాల పెద్ద మల్లేశంవెలిచలచిన్నమల్లేశం కాంగ్రెస్నాయకులుపాలుగొన్నారు

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయండి..

- అధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రక్రియ పూర్తి చేయాలి..
- కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, మే 19 (ప్రజాజ్యోతి )
కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కూడా సత్వరమే అన్లోడింగ్ జరగాలని స్పష్టం చేశారు.మంగళవారం రాత్రి కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లు, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ధాన్యం కొనుగోలు నుంచి మిల్లుల్లో అన్లోడింగ్ వరకు ప్రతి దశలో వేగం పెంచాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి ఆర్డిఓకే మహేశ్వర్ జిల్లా పౌరసరఫరాల అధికారి






ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, మిల్లులకు వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరలించిన ధాన్యం మిల్లుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. నర్సింగారావు పౌరసరఫరాల డిఎం రజనీకాంత్ సహకార అధికారి రామానుజ చార్యులు డిఆర్డిఓ గీత జిల్లాస్థాయి అధికారులు తహసిల్దార్లు మిల్లర్ల సంఘం నాయకులు ట్రాన్స్పోర్ట్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు..

# సేంద్రియ వ్యవసాయం – రైతుల ఆదాయానికి, ఆరోగ్యానికి భరోసా

మేడిపల్లి మే 19 ప్రజా జ్యోతి
మండల కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు రైతులకు సేంద్రియ వ్యవసాయం, సమగ్ర పోషక యాజమాన్యం, నేల ఆరోగ్య పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడంతో పాటు పంట ఉత్పాదకతపై దీర్ఘకాలిక ప్రభావం పడుతుందని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రైతులు సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు వినియోగించాలని సూచించారు.అలాగే రైతులు పంటల మార్పిడి విధానం పాటించడం, నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయడం, యూరియా అధిక వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఖర్చులు తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా తగిన పంటలను ఎంపిక చేసుకోవాలని, అలాగే విశ్వవిద్యాలయం విడుదల చేసిన మెరుగైన వరి రకాల సాగుపై రైతులకు సూచనలు అందించారు.శాస్త్రవేత్త శ్రీమతి భవ్య మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా ఉత్పత్తి అయ్యే ఆహారం ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు మార్కెట్లో మంచి ధర లభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. టీచింగ్ అసోసియేట్ అష్ఫాక్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఉత్తమ వరి రకాల లక్షణాలు, దిగుబడి సామర్థ్యం మరియు సాగు విధానాలపై రైతులకు వివరించారు. ఏఈవో మంజుల రైతులకు ప్రభుత్వ పథకాల వివరాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని శాస్త్రవేత్తల సూచనలను ఆసక్తిగా వినారు. ఇలాంటి కార్యక్రమాలు





తరచూ నిర్వహించాలని రైతులు కోరుతూ కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# ప్రజాభిమాన నేతగా శైలెంధ(దీ)రుడు,

- పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు ,
- అభినందన సభలో ,శైలేందర్ రెడ్డి కి,మంత్రి అడ్లూరీ ప్రశంసలు,
- అంతర్జాల సమూహ వేదికల్లో సేవల్ని కొనియాడుతున్న అభిమానులు,

ఎండపల్లి , మే 19, ప్రజా జ్యోతి
ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందినటువంటి తాటిపర్తి శైలేందర్ రెడ్డి



చిన్ననాటి నుండే అనేక చైతన్య వంతమైన కార్యక్రమంలో ముందుండే వారని, గ్రామ ముద్దుబిడ్డగా ఇటీవల తన తల్లి సర్పంచుగా,ఉంటే,వారికి శైలెందర్ రెడ్డి ప్రోత్సాహాన్నిస్తూ, మంచి రాజకీయ నాయకురాలిగా తల్లికి వెన్ను దన్నుగా ఉండి,తల్లికి తగ్గ తనయుడిగా , గ్రామానికి కావలసిన అన్ని రకాలుగా,గ్రామాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి చెందుతూ తల్లి పాత్రను ముందుకు నడిపిస్తూ గత ఎనిమిదేళ్లుగా పార్టీ కోసం నిరంతరం తపిస్తూ,,తాను కూడా గ్రామ స్థాయిలోనే కాకుండా ఉమ్మడి వెల్గటూర్ మండలం నుండి ఉమ్మడి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పని చేస్తూనే పిసిసి కార్యవర్గ సభ్యులుగా ఉంటూ,రాష్ట్ర నాయకులుగా, కాంగ్రెస్ పార్టీ నుండి రాష్ట్రంలో ఇటీవల జరిగినటువంటి 2023 శాసనసభ ఎన్నికలలో ధర్మపురి శాసనసభ్యులుగా గెలుపొందిన అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ కి వెన్ను దన్నుగా నమ్మిన బంటుగా ఉండి పార్టీని గెలిపించడంలో శైలెంధర్ రెడ్డి ఎనలేని పాత్ర పోషించి , అటు కార్యకర్తలకు ఇటు పార్టీకి ఎంతో కృషి చేశారు ,ఇది ఇలా ఉండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం ప్రభుత్వ తోడ్పాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రోత్సాహం,ప్రజల వెన్నుదన్ను తో ,ప్రజాభిమానం చూరగొన్న నేతగా ప్రజల హృదయాల్లో నిలుస్తున్నారని,చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరినీ కలుపు కునే పోయే వారి తీరు, ఎక్కువ మొత్తంలో అభిమానుల్ని చేసి పెట్టింది, గొప్ప నాయకులు, చాలా మంచి వారని, అందరినీ ఆదరించే మనసు గల వారని ఆపదలో ముందుండి, మీకు నేనున్నానంటూ, సమస్య పరిష్కారం అయ్యేవరకు నిష్క్రమించని నాయకుడని మండల స్థాయిలో అక్కడక్కడ బాహాటంగా చర్చలు జరగడం విశేషం, ఇటీవల కాంగ్రెస్ పార్టీ పలు మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ప్రకటించి, అభినందన సభను ఏర్పాటు చేసిన తరుణంలో, పీసీసీ కార్యవర్గ సభ్యులు తాజా మాజీ ఉమ్మడి వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి,పార్టీకి చేస్తున్న కృషికి అభినందన సభలో స్వయంగా మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ చేత ఉమ్మడి వెల్గటూర్ మండల ప్రశంసలు అందుకోవడంతో, అభిమానులు



కార్యకర్తలు నాయకులు హర్షం వ్యక్తం చేశారు,అధ్యక్షుడిగా, తాను చేసిన సేవల్ని, అభిమానులు, కార్యకర్తలు, అంతర్జాల సమూహ వేదికల్లో పాలుపంచుకుంటున్నారు,అంటే తాను పార్టీకి కార్యకర్తలకు ఎంత అభిమానమో, వారు పార్టీకి చేసిన కృషిని అర్థం చేసుకోవచ్చు,రాబోయే రోజుల్లో నైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోడ్పాటు ,మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో, పార్టీ కార్యకర్తలు అండదండలతో మరిన్ని ఉన్నతమైన హోదాలను పొందాలని పార్టీకి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పిస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు,కాగా ఈ విషయమై పిసిసి కార్యవర్గ సభ్యులు,తాజా మాజీ ఉమ్మడి వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తాటిపర్తి శైలేందర్ రెడ్డి,నీ సంప్రదించగా, నాకు పదవులు ముఖ్యం కాదని,పార్టీ కోసం పని చేసిన నాయకులను పార్టీ,అధినాయకత్వం గుర్తిస్తుందని, ప్రస్తుతానికి ధర్మపురి నియోజకవర్గంలో ఉమ్మడి వెల్గటూర్ మండలంలో,సంక్షేమ శాఖ, మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ వెన్నంటి ,కార్యకర్తలను కలుపుకొని,ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా మా పయనం,సాగుతుందని, పార్టీ బలోపేతనే లక్ష్యంగా ముందుకు వెళతామని తెలిపారు,

# పుచ్చలపల్లి సుందరయ్య 41.వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

ముస్తాబాద్, మే 19
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం రోజున19-5-2026న భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చల పల్లి సుందరయ్య 41వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ముస్తాబాద్ మండల కన్వీనర్ గీస బిక్షపతి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య తన జీవితాన్ని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. రాజకీయాలకు నైతిక విలువలు తీసుకొచ్చిన నాయకుడిగా, ప్రజల కోసం తన భూములను పేదలకు ఇండ్ల స్థలాలుగా ఇచ్చిన త్యాగమూర్తిగా ఆయనను గుర్తు చేశారు.



మూడుసార్లు అసెంబ్లీకి ఎన్నికై ప్రజాసేవలో విశేష అనుభవం సంపాదించిన సుందరయ్య, సైకిల్‌పై అసెంబ్లీకి వెళ్లి సాధారణ జీవన విధానంతో రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఆయన చేసిన త్యాగాలు, ప్రజల పట్ల చూపిన అంకితభావం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ "జోహార్ పుచ్చలపల్లి సుందరయ్య" అంటూ ఘన నివాళులు అర్పించారు.
ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు, పారిశుద్ధ్య కార్మికులకు గీస బిక్షపతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, పల్లె బాబు, జిల్లా లక్ష్మణ్, బాలెళ్ళు లక్ష్మి, రంజాన్, రాజయ్య, బిక్షపతి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం.

గంగాధర మే 19: (ప్రజా జ్యోతి)
మండలంలోని కురిక్యాల గ్రామంలో మంగళవారం "ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమానికి ఆర్ఏఆర్ఎస్–పొలాస శాస్త్రవేత్తలు స్వాతి, డాక్టర్ రవి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, హాజరై రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. పలు వ్యవసాయ అంశాలపై శాస్త్రీయ సలహాలు రైతులకు అందించారు. ముఖ్యంగా యూరియా సమతుల్య వినియోగం, నాణ్యమైన వరి సన్న రకాల ఎంపిక, ఆయిల్ పామ్ సాగు అవకాశాలు, సేంద్రియ వ్యవసాయం, వివిధ పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల మరియు వ్యాధుల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులు తమ పంటలకు సంబంధించిన



సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కురిక్యాల వ్యవసాయ విస్తరణ అధికారి వెంకట్, మల్లాపూర్ వ్యవసాయ విస్తరణ అధికారి వంశీధర్, పాక్స్ సొసైటీ ఇంచార్జి విక్రమ్, మరియు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## రంగాపూర్ ఐజి గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వకు ఏర్పాట్లు

పెద్దపల్లి, ప్రతినిధి మే 19 ప్రజా జ్యోతి;
జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఐజి గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రంగాపూర్‌లో గల ధాన్యం గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బుధవారం నుంచి జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి రంగాపూర్ ఐజి గోదాంకు మొక్కజొన్న తరలింపు



చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోడి పందాల స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

- 14 మంది అరెస్ట్.. నగదు, వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి

సుల్తానాబాద్, మే 19 (ప్రజా జ్యోతి):
ఎలిగేడు మండలం శివపల్లి గ్రామ శివారులోని బోడగుట్ట ప్రాంతంలో రహస్యంగా కొనసాగుతున్న కోడి పందాల స్థావరంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి 14 మందిని అరెస్ట్ చేశారు. పందాలకు వినియోగిస్తున్న కోడి పుంజులు, కత్తులు, నగదు, వాహనాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.
కోడి పందాలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ముందుగానే పక్కా రెక్కీ నిర్వహించి, స్థావరానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మంగళవారం పాత్రికేయ సమావేశంలో డీసీపీ రామ్‌రెడ్డి మాట్లాడుతూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని, కోడి పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందిన వెంటనే అధికారులు పక్కా రెక్కీ నిర్వహించి పూర్తి సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. ఏసీపీ పెద్దపల్లి జి. కృష్ణ పర్యవేక్షణలో సీఐలు పి. రంజిత్‌రావు, కే. ప్రవీణ్, ఎస్సైలు చంద్రకుమార్, సనత్‌రెడ్డి, శ్రీధర్, నరేష్‌తో పాటు ప్రత్యేక బృందాలు సమన్వయంతో కార్యాచరణ రూపొందించాయి.
పోలీసులు ఆకస్మికంగా బోడగుట్ట ప్రాంతానికి చేరుకోగా అక్కడ కోడి పందాలు జోరుగా కొనసాగుతున్నట్లు గుర్తించారు. పోలీసులను గమనించిన వెంటనే అక్కడున్న పలువురు పరారయ్యేందుకు ప్రయత్నించినప్పటికీ అప్రమత్తమైన పోలీసులు 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో శివపల్లి, పెద్దపల్లి, గోదావరిఖని, ఇందారం, రామగిరి, జైపూర్ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.
అరెస్టయిన వారిలో కొందరిపై గతంలో కూడా కోడి పందాలకు సంబంధించి పలు కేసులు నమోదై ఉన్నట్లు విచారణలో తేలింది. దుగ్యాల కార్తీక్ రావు బత్తుల రాజు సల్లూరి పవన్ గడ్డం రాకేష్ పొట్లపల్లి మనోహర్ వెన్న రవీందర్ పులి నాగరాజ్ కొల్లూరి మహేష్ ఎండి సింగారపు అఖిల్ వర్మ ఓజ్జ శంకర్, ఎండీ రహీమ్, వేల్పుల సతీష్, పొన్నాల రాజుతో పాటు మరికొందరిపై గతంలోనూ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో వీరు అలవాటుగా ఈ చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.
దాడిలో 6 కోడి పుంజులు, 6 కత్తులు, 13 మొబైల్ ఫోన్లు, రూ.40 వేల నగదు, 7 ద్విచక్ర వాహనాలు, ఒక ఎర్టిగా కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై తెలంగాణ గేమింగ్ యాక్ట్–1974, జంతు హింస నిరోధక చట్టం–1960తో పాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.
కోడి పందాలు సంప్రదాయం పేరుతో నిర్వహించినప్పటికీ అవి పూర్తిగా చట్టవిరుద్ధమని పోలీసులు స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా మూగజీవాలపై క్రూరత్వానికి దారితీస్తాయని పేర్కొన్నారు. గ్రామాలు, శివార్లలో ఎక్కడైనా కోడి పందాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే డయల్–100కు సమాచారం అందించాలని డీసీపీ రామ్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన అధికారులను, సిబ్బందిని డీసీపీ అభినందించారు .






## ఎంసెట్‌లో టాలెంట్ స్కూల్ చిన్నారికి 689వ ర్యాంక్



సత్తుపల్లి మే19(ప్రజా జ్యోతి) ఇటీవల విడుదలైన ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో పట్టణంలోని సిద్ధారం రోడ్ లో గల టాలెంట్ స్కూల్ చిన్నారి షేక్ అతియా కౌశర్ కి 689వ ర్యాంక్ సాధించినట్లు టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. నర్సరీ నుండి 10వ తరగతి వరకు టాలెంట్ స్కూల్ లో విద్యనభ్యసించి 10వ తరగతి ఫలితాల్లో 10 జిపిఏ సాధించి, విజయవాడలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి,ఇటీవల విడుదలైన ఎంసెట్ ర్యాంకుల్లో 689వ ర్యాంక్ సాధించడం పట్ల టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పులి అరుణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక లక్ష్యంతో చదువుకుంటే జీవితం స్థిరపడుతుందని, మంచిర్యాంకు రావడం మన స్కూల్ కి గొప్ప వరమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ యాజమాన్యం, స్కూల్ ఇన్చార్జి శంకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గంగారం పంచాయతీలో పెన్షనర్స్ వెరిఫికేషన్



సత్తుపల్లి మే19(ప్రజా జ్యోతి) గంగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కాకర్ల రేవతి, సత్తుపల్లి ఎంపీడీవో సిహెచ్ నాగేశ్వరరావు, గ్రామపంచాయతీ సెక్రటరీ రవి , మరియు వార్డు మెంబర్ల ఆధ్వర్యంలో మంగళవారం గంగారం గ్రామపంచాయతీ పరిధిలో లో ఉన్నటువంటి వృద్ధాప్య, వితంతు,వికలాంగ పెన్షన్లు, ఈకేవైసీ చేసేందుకు పంచాయతీలో ఏర్పాటు చేశారు.గ్రామంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ బుధవారం పెన్షనర్స్ ఈ కేవైసీ చేయించుకోవాలివని, బాగా వృద్ధాప్యంలో ఉండి నడవలేని స్థితిలో ఉన్నటువంటి వారు ఎవరైనా ఉంటే రెండు రోజుల తర్వాత మీ ఇంటికి వచ్చి చేపిస్తాము అని అన్నారు.ఎవరైనా నడవలేని స్థితిలో ఉంటే క్రింది నెంబర్లను సంప్రదించాలని అన్నారు. సర్పంచ్ కాకర్ల రేవతి 9505244369,ఉప సర్పంచ్ బెజవాడ రాధా 9493720919,కావేటి అప్పారావు వార్డు మెంబర్ 7989621583, కోలగట్ల చెన్నకేశవరావు 9963271369 లను సంప్రదించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## మొక్కజొన్న బస్తాల దిగుమతి వేగవంతం చేయాలి

కారేపల్లి జిన్నింగ్ మిల్లులో స్థానిక రైతులకు అవకాశం ఇవ్వాలి

రైతు సంఘం నాయకులు



కారేపల్లి, మే 19, ప్రజా జ్యోతి : ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన మొక్కజొన్న బస్తాల దిగుమతిలో తీవ్ర జాప్యం జరుగుతుందని దానిని నివారించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ లు డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలోని జిన్నింగ్ మిల్లులో మొక్కజొన్న బస్తాల స్టాక్ పాయింట్ ను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు తోపాటు దిగుమతి పాయింట్ లో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. రైతులు, వాహనాల డ్రైవర్లతో రైతు సంఘం నేతలు మాట్లాడారు. సోసైటీ అధికారులతో చర్చించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానిక అధికారులను కోరారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కారేపల్లి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న బస్తాల స్టాక్ పాయింట్‌లో స్థానిక రైతుల ట్రాక్టర్లు, లారీలు కి కూడా అవకాశం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారుల మధ్య సమన్వయం, అవగాహన లేకపోవడంతో మొక్కజొన్న బస్తాలు దిగుమతి కేంద్రాల్లో రైతులు, లారీ, ట్రాక్టర్లు డ్రైవర్లు రోజుల తరబడి తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. దిగుమతి పాయింట్ వద్ద కనీసం మంచినీరు కూడా అందుబాటులో లేదన్నారు. ఏక కాలంలో ఎక్కువ పాయింట్ల లో దిగుమతిలు చేయాలని సూచించారు. ఒక్క పాయింట్ పూర్తిగా నిండిన తర్వాత మరో పాయింట్ దిగుమతి కి అవకాశం ఇవ్వడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సందర్భంగా జిన్నింగ్ మిల్లుకు వచ్చిన మార్క్‌ఫెడ్ డీయం కు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కారేపల్లి మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, కార్యదర్శి వజ్జా రామారావు, సోసైటీ డైరక్టర్ అడ్డగోడ ఐలయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల మౌలిక సమస్యలను పరిష్కరించండి

– వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు: అన్నవరపు కనకయ్య



మణుగూరు, మే 19 (ప్రజాజ్యోతి): ఉపాధి కూలీల మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజివిక మిషన్ గ్రామీణ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిచేస్తున్న కార్మికుల యొక్క హాజరు యాప్ ఆధారంగా రోజులో రెండుసార్లు ఫోటోలు తీసి మస్టర్ వేసే పద్ధతి వల్ల ఉపాధి కూలీలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో చేసిన పనికి కూడా మస్టర్ నమోదు కావడం లేదని రెండుసార్లు ఫోటోలు తీసే మస్టర్ నమోదు చేసే పద్ధతి వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మండుటెండల్లో ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో చేతులకు బొబ్బలు వచ్చేలా పనులు చేస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు కూడా సకాలంలో అందడం లేదని మండిపడ్డారు. పని ప్రదేశాల్లో నిలువ నీడ కూడా లేకుండా కూలీలు పనులు చేస్తూ మండుటెండల్లో మగ్గిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు మంచినీళ్లు, టెంటు, మెడికల్ కిట్టు, పనిముట్లు కనీస మౌలిక సౌకర్యాలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని, ప్రతి ఒక్కరికి ఉపాధి కార్డుతో సంబంధం లేకుండా 200 రోజులు పని దినాలు కల్పించి రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు, పిట్టల నాగమణి, నైనారపు నాగేశ్వరరావు, బొల్లం రాజు, సంకినేని వెంకట్రావు, తోట పద్మ, కనితి సత్యనారాయణ, బండారి స్వరూప, పొడుతూరి సునీత, చీమల మల్లయ్య, కనకం సరిత, కొప్పుల మాధవి తదితరులు ఉన్నారు.

## ఉపాధి హామీ కార్మికులకు సామాగ్రి పంపిణీ





పినపాక, మే 19 (ప్రజాజ్యోతి): బోటిగూడెం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికులకు అవసరమైన సామాగ్రిని సర్పంచ్ నూప బాపనమ్మ, ఉప సర్పంచ్ ధన లక్ష్మి, గ్రామ సెక్రటరీ జ్యోతి, వార్డ్ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధితో పాటు కార్మికుల జీవనోపాధికి తోడ్పాటు అందుతుందని తెలిపారు. కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, కార్మికులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

### కల్లూరులో ప్రభుత్వ పాఠశాలలకు
## ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ ప్రారంభం



కల్లూరు, మే 19 : ప్రజా జ్యోతి కల్లూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభం అయ్యే లోపే పుస్తకాలు అందుబాటులో ఉండేలా ముందస్తుగానే నోట్ బుక్స్ పంపిణీ చేస్తుందని కల్లూరు విద్యాశాఖ అధికారి తెలిపారు దీనివల్ల విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు చదువులో వెనకబడకుండా సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు కల్లూరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని పి.నివేదిత పాఠశాలలకు నోట్‌బుక్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీ ఆర్ పీలు పాల్గొన్నారు.

### బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో
## ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

– జ్యోతి, డిడి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ – దరఖాస్తుల సమర్పణకు జూన్ 6 చివరి తేదీ

– వ, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు ఖమ్మం జిల్లాలోని ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి 2026–27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) పాఠశాలల్లో 1వ తరగతి, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాకు చెందిన అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ,విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు జి.జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్ / డే స్కాలర్స్) లో 128 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్) లో 131 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల కి లక్షా 50 వేలు లోపు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల లోపు ఉండాలని, తల్లిదండ్రులు డిగ్రీ లేదా అంత కంటే ఎక్కువ చదువుకుని ఉంటే అనర్హులని స్పష్టం చేశారు. 1వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులు 2020 జూన్ 1 నుండి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలని (5 నుండి 6 సంవత్సరాల లోపు), ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం ఎస్సీ ఉపకులాల వారీగా (కేటగిరి–1 కు 1 శాతం, కేటగిరి–2 కు 9శాతం, కేటగిరి–3 కు 5 శాతం) సీట్లు కేటాయించబడతాయని వివరించారు.ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను మే 20 నుండి జూన్ 06 వరకు ఖమ్మం కలెక్టరేట్ వెంకటాయపాలెం లోని రూమ్ నెంబర్ ఎా–34 లో గల షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుల కార్యాలయం నుండి పొంది, పూర్తి చేసిన దరఖాస్తులను తగిన ధృవీకరణ పత్రాలతో (మీ–సేవ ద్వారా పొందిన లేటెస్ట్ కుల,ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్,రేషన్ కార్డు,మార్క్స్ మెమో లేదా బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు) జతపరిచి జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తిరిగి అదే కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో సంప్రదించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆదిలక్ష్మి మృతికి కూసంపూడి నివాళి




సత్తుపల్లి మే19 (ప్రజా జ్యోతి) పట్టణంలోని గాంధీనగర్ 14వ వార్డుకు చెందిన వేముల ఆదిలక్ష్మి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినారు. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, వార్డ్ కౌన్సిలర్ ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని,కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు. నివాళులు తెలిపిన వారిలో అద్దంకి అనిల్,వెనిగళ్ళ మాధవి,గోపి బి.ఆర్.ఎస్ నాయకులు ఉన్నారు.

### వార్డు ప్రజలకు మెరుగైన
## సౌకర్యాలు కల్పిస్తాం: కమల్ పాషా



సత్తుపల్లి మే19 (ప్రజా జ్యోతి) వార్డు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా అన్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ నగర్ లో కాంగ్రెస్ నాయకులు షరీఫ్ తో కలిసి వార్డు మొత్తం కలియ తిరిగారు. ఈ సందర్భంగా జెసిబి సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించి, డ్రైనేజి పరిశుభ్రం చేపించారు. వార్డు ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా పనులను వేగవంతం చేపించారు. ఈ కార్యక్రమంలో ఆంగోతు రామారావు, వెంకటరెడ్డి కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# ఆన్లైన్ విక్రయాలపై ఆగ్రహం!

- పెరుగుతున్న 'కార్పొరేట్' మందుల వ్యాపారం
- మెడికల్ షాపుల వ్యాపారాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్న బడా కంపెనీలు
- భారీ డిస్కౌంట్లతో ఎర
- నకిలీ మందులతో తలెత్తుతున్న ఇబ్బందులంటూ ఆరోపణలు
- నేడు దేశ వ్యాప్తంగా మెడి కల్ దుకాణాల బంద్‌కు ఐవోసీడీ పిలుపు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 842 పైగా మెడికల్ షాపులు
- సత్వరమే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్







**కార్పొరేట్ కంపెనీల భారీ డిస్కౌంట్లతో, ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో మెడికల్ షాపుల వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని, నకిలీ మందులతో ప్రజల కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆరోపిస్తూ దేశవ్యాప్తంగాఉన్న మెడికల్ షాపుల ఓనర్లు ఆందోళన చేపట్టనున్నారు.అందుకు అనుగుణంగా ఈనెల నేడు దేశవ్యాప్తంగా ఉన్న మెడి కల్ షాప్లను బంద్ చేయాలంటూ ఏఐవోసీడీ (ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్) పిలుపునిచ్చింది.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 19(ప్రజా జ్యోతి): ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనీ సుమారు 842 మెడికల్ షాపులు నేడు మూతపడనున్నాయి. నాలుగు రోజుల క్రితం బంద్ కు సంబంధించిన పోస్టర్లను సైతం తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసి యేషన్ సభ్యులు విడుదల చేశారు. ఈ–ఫార్మసీ సంస్థలు భారీ డిస్కౌంట్లతో మందులు విక్రయించడం వల్ల చిన్న మెడికల్ షాపులు నష్టాల్లోకి వెళ్తున్నాయని మెడికల్ దుకాణాల నిర్వాహకులు, సంఘ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ బంద్ కు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరి స్తున్న విధానాలతో రిటైల్, డీలర్ల విక్ర యాలపై ప్రభావం చూపుతున్నాయ ని ఆరోపిస్తున్నారు.

**ఆన్లైన్ అన్నివిధాల నష్టాలే//**

ఆన్లైన్ లో ఔషధాల విక్రయాలతో రిటైల్ మందుల షాపుల్లో విక్రయాలు తగ్గి కుదేలవడంతో పాటు ప్రజలకు నకిలీ మందులు అందే అవకాశం లేకపోలేదు. నిషేధిత, పరిమితికి మించిన ఔషధాల కొనుగోలు ఒకే ప్రిస్క్రిప్షన్ ను పలుసార్లు రిపీట్ చేస్తూ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే మందులను మోతాదుకు మించి అమ్మకాలు జరుపుతున్నారని మెడికల్ దుకాణాల, సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ–ఔషధి పేరిట కరోనా సమయంలో 2020 మార్చి 23న జారీ చేసిన 220(ఈ) నోటిఫికేషన్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా కార్పొరేట్ కంపెనీల డిస్కౌంట్ల వెనుక భారీ కుట్ర ఉందని, బ్రాండెడ్ ఔషధాల ధరలను యథావిధిగా డ్రగ్ లైసెన్స్ అథారిటీ లేని బలం, విటమిన్స్, తదితర అన్బ్రాండెడ్ ఔషధాలపై అధిక ధరలను ముద్రించి డిస్కౌంట్ పేరిట ధరలను కొద్దిమేర మా త్రమే తగ్గిస్తూ.. ప్రజలకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. అటు ప్రజల ఆరోగ్యాలను.. ఇటు మెడికల్ దుకాణ వ్యాపారాల ను రక్షించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరుతున్నారు.

**జిల్లాలో 842మెడికల్ దుకాణాలు//**

జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట నియోజక వర్గాలలో మొత్తం 842 మెడికల్ దుకాణాలు ఉన్నాయి. వీటిలో ప్రతీరోజు లక్షల రూపాయలలోనే విక్రయాలు జరుగుతాయి. అయితే, బంద్ కారణంగా అత్యవసర మందులు అవసరమైన రోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా గతంలో మాదిరి కొంతమంది మెడి కల్ షాపులు పరిమితంగా సేవలు అందించే అవకాశము సంఘ ప్రతినిధులు కల్పించాల్సిన అవసరం ఉంది

**ఆన్లైన్ అమ్మకాలతో అందరికీ నష్టమే: జోగారావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ , కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్//**

ఆన్లైన్ అమ్మకాలతో అటు ప్రజలకు.. ఇటు మెడికల్ దుకాణాల నిర్వాహకులకు నష్టమే వాటిల్లుతుంది. డాక్టర్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ ద్వారా దుకాణాలలో విక్రయించే మందులను ఒకటికి రెండు సార్లు పరిశీలించిన తర్వాతనే నిర్వాహకులు అమ్మకాలు జరుపుతుంటారు. పలు సందర్భాలలో ప్రజలు తాము అమ్మకాలు జరిపిన మళ్లీ వైద్యులను సంప్రదించి మాత్రమే వినియోగి స్తుంటారు. ఆన్లైన్ అమ్మకాలు, డిస్కౌంట్ల పేరుతో చేసే మోసాలను అరికట్టాలి.

**నేటి బంద్‌ను విజయవంతం చేయాలి: పరిమి సోమశేఖర్, డివిజన్ అధ్యక్షులు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్//**

ఒకే ప్రిస్క్రిప్షన్ ను పలుసార్లు రిపీట్ చేస్తూ.. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే మందులను మోతాదు కు మించి ఆన్లైన్లో అమ్మకాలు జరుపుతున్నారు. ఈ–ఔషధి పేరిట కరోనా సమ యంలో ఇచ్చిన నోటిఫికేషన్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేడు నిర్వహించే బంద్ కు సహకరించాలని కోరుతున్నాం.

## ఈనెల 20న జాబ్ మేళా

ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్: సంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువత జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 20వ తేదీన ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని వెలుగు ఆఫీస్ సమీపంలో



గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కు చెందిన లైఫ్ మిత్ర పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ ద్వారా ఆకర్షణీయమైన కమిషన్ ఆధారిత వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలు మరియు ఆధార్ కార్డు ప్రతులతో నేరుగా హాజరు కావాలని సూచించారు.మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఫోన్ నంబర్ 08455-271010 ను సంప్రదించవచ్చని తెలిపారు.

## తెలంగాణ సమాజం మార్పును కోరుతుంది

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది ప్రజా వ్యతిరేక పాలన**

**మాజీ జిల్లా జాగృతి అధ్యక్షులు ఇంచార్జి వీరప్పగారి రమేష్ గౌడ్**

మెదక్,కొల్చారం మే 19 :(ప్రజా జ్యోతి)



తెలంగాణ సమాజం మార్పును కోరు కుంటున్నారని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) మెదక్ జిల్లా నాయకులు, మాజీ జాగృతి జిల్లా అధ్యక్షులు వీరప్ప గారి రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీబడి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబి స్తున్నారని మండిపడ్డారు. మోడీ ప్రభు త్వం 5 రాష్ట్రాల్లో ఎన్నికల పూర్తికాగానే పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచిసామాన్య ప్రజల మీద భారం మోపారని విమ ర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా అలసత్వం వహిస్తుందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కల్లో ఇచ్చిన 420 వాగ్దానాలను విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్లు గడిచినా, మహిళలకు గృహ జ్యోతి పథకం ద్వారా 2500 రూ,నిరుద్యోగులకు 3000 భృతి, ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. తెలంగాణ ఉద్యమ కారులకు పెన్షన్లు ఇస్తామని, ఇష్టనూరితిగా వాగ్దానాలు చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలిపెట్టిందని దుయ్యబట్టారు. రాబో వు ఎన్నికల్లో అధినేత కవితమ్మ నాయకత్వంలో టిఆర్ఎస్ పార్టీ అధికా రంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రజలు సుభిక్షమైన పాలన చూస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.మార్పుని కోరుకున్న తమిళనా డులో సినీ హీరో విజయ్ పార్టీ పెట్టిన రెండు ఏళ్లలోనే అధికారంలోకి వచ్చిందన్నారు. తెలం గాణలో ప్రజలు మార్పును కోరుకుంటు న్నారు.కవితమ్మ పంచజన్య పాలన రాబోతుంది, ఉచిత విద్య, ఉచిత వై ద్యం, రైతు సంక్షేమం, నిరుద్యోగ ఉపా ధి, సామాజిక న్యాయం పంచజన్య పాలసీతో అమ్మ పాలన తెలంగాణ ప్రజలకు అందిస్తారని జిల్లా ఇంచార్జి ఇన్చార్జ్ పాపగారి రమేష్ గౌడ్ అన్నారు. పార్టీ అధినేత ఆదే శాల మేరకు నేటి నుండి జూన్ 20 వరకు నెల రోజుల పాటు తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ జెండా పండుగలు నిర్వహించ నున్నట్టు రమేష్ గౌడ్ తెలిపారు .

# నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

- డివైడర్ వేసి వదిలేసారు
- రోడ్డు విస్తరణ పనులు కంకరతో సరిపెట్టారు
- దుమ్మూ దూలితో వాహనదారుల అవస్తలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

అందోలు, మే19, (ప్రజాజ్యోతి): సంగుపేట నుండి జోగిపేట వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు పూర్తయినా జోగిపేట నుండి అన్నాసాగర్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో పురోగతి కనిపించటం లేదు. పనులు నత్తనడకన కొసాగుతున్నాయి. రోడ్డు విస్తరణ చేసేందుకు రోడ్డుకు ఇరువైపులా తొవ్వి కంకర వేసారు. మధ్యలో కొంత దూరం డివైడర్ కూడా వేసారు. అందోలుకు గుండెకాయ లాంటి జోగిపేట పట్టణానికి పరిసర గ్రామాల నుండి సమీప పట్టణాల నుండి ప్రజారవాణా వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అయితే అన్నా సాగర్ నుండి జోగిపేట వరకు తారు రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో వాహనాల రాకపోకల సందర్భంగా దుమ్ము ధూళి ఎగిసిపడు



తుంది. చిన్న చిన్న వాహనాలు వెలుతున్నా దుమ్ము విపరీతంగా ఎగిసిపడుతుంది. బస్సు, లారీ లాంటి భారీ వాహనాలు వెలుతుంటేనే వాటి వెనకాల ప్రయాణిస్తున్న వాహనదారులకు దారికూడా కనిపించడంలేదు. రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టి నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విస్తరణ పనులు పూర్తికాని రోడ్డుపై భారీ వాహనాలు వెళుతుంటే పాదచారులు, బైకుల పై ప్రయాణిస్తున్న ప్రయాణికుల కళ్ళల్లో దుమ్ము ధూళి పడుతుందని, ప్రమాదాలు కూడా జరిగే అవకాశం లేకపోలేదని స్థానికులు వాపోతున్నారు. పట్టణానికి వచ్చి పోయే ప్రయాణికుల ప్రయాణం సాఫీగా సాగాలంటే రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్ తో పనులు పూర్తి చేయించాలన్నారు.

పనుల జాప్యంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..!?: మంత్రి దామోదర రాజనర్సింహా అందోలులో అభివృద్ధి జపం చేస్తుంటే అందుకు విరుద్ధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలు ప్రాంతానికి వేల కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేస్తూ ఉంటే కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి



చేయక మంత్రికి చెడ్డ పేరు తీసుకువస్తున్నారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో సంగుపేట నుండి అన్నా సాగర్ వరకు 20 కోట్లతో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో జరుగుతున్న పనుల జాప్యంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. పనులు మొదలుపెట్టి నెలలు గడుస్తున్నా అడుగు ముందు పడడం లేదు. మంత్రి ఆశయాలకు అనుగుణంగా అధికారులు, కాంట్రాక్టర్లు పనిచేస్తే అందోలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని సామాన్య ప్రజలు భావిస్తున్నారు.

## దేశంలో చాపకింద నీరులా మతమార్పిళ్లు

మొదటిపేజీ తరువాయి..


లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా.. దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్‌మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకొని.. అనంతరం మత మార్పిడి చేసుకోవాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ముందుగా జిమ్‌లలో చేరి అక్కడి యువతులతో పరిచయం పెంచుకుంటుందని.. అనంతరం తన స్నేహితులుగా పేర్కొంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. మరికొందరు మహిళలను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల ద్వారా పరిచయం పెంచుకొని.. వారిలో మతమార్పిడి ఆలోచనలు కలిగేలా బ్రెయిన్ వాష్ చేసేవారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లలో వందలాది మంది మహిళల ఫొటోలు, వీడియోలు, చాట్‌లు ఉన్నాయని.. వాటిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితులపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10మంది అనుమానితులను అరెస్ట్ చేశామని.. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

### ఉద్యోగులు, పెన్షనర్ల కోసం

## హెల్త్ కేర్ ట్రస్ట్

మొదటిపేజీ తరువాయి..

ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్



చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగ పడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర వైద్య సేవలను సులభంగా పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.






## ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

మొదటిపేజీ తరువాయి..

డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్లపై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం అందించింది. డి ఆర్ సి లో ఉన్న ఒక అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో, చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎయిడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

## వీధికుక్కలను తరలించాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967